ఆబ్కారీ శాఖలో బదిలీల చిచ్చు

☛ పలువురు ఉద్యోగుల ఆందోళన

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ శాఖలో కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్ల బదిలీ వ్యవహారం చిచ్చు రాజేసింది. ఉమ్మడి జిల్లాలో 68 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 136 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేసిన సంగతి విదితమే. బదిలీల తీరుపై మంగళవారం కర్నూలులోని జిల్లా కార్యాలయం వద్ద పలువురు కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు అసహనం వ్యక్తం చేశారు. ఆందోళన చేసేందుకు సిద్ధపడగా పలువురి సూచనలతో ఉపసంహరించుకున్నారు. పేరుకు ఒక్కొక్కరికి ఐదు అవకాశాలు ఇచ్చినా బదిలీలు మాత్రం ఇష్టారాజ్యంగా చేశారని వారు వాపోయారు. నిబంధనల ప్రకారం చెక్‌పోస్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగులను స్టేషన్లకు, ఇతర విభాగాలకు బదిలీ చేయకుండా మళ్లీ చెక్‌పోస్టులకే పోస్టింగులు ఇచ్చారని చెప్పారు. అనారోగ్యానికి గురైనవారిని.. సమస్యలతో బాధపడేవారిని పట్టించుకోలేదన్నారు. దాదాపు 40 మంది కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు సిఫారసులతోపాటు ముడుపులిచ్చి జిల్లా కేంద్రాలు, అనుకూల ప్రాంతాల్లో పోస్టింగులు దక్కించుకున్నారని ఆరోపించారు. బదిలీల వ్యవహారంపై విచారణ జరిపించి న్యాయం చేయాలంటూ సంబంధిత అధికారిని కలిసేందుకు యత్నించగా సాయంత్రం వరకు అనుమతించలేదు. కొందరికి మాత్రమే ఫోన్ చేసి కార్యాలయంలోకి పిలిపించుకుని మంతనాలు జరిపారు.

3 నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా ఈనెల 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీఈవో శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీన బడులు పునఃప్రారంభమవుతాయన్నారు. సెలవు రోజుల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తెరిస్తే చర్యలు తప్పవన్నారు.

రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన న్యాయ విద్య 3, 5వ ఏడాదికి సంబంధించి 2, 4, 6, 8, 10వ సెమిస్టర్ లా రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల చేసినట్లు ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ మంగళవారం తెలిపారు. ఫలితాల కోసం ఆర్‌యూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

పశ్చిమ ప్రాంతానికి సాగునీరు

- ప్రజా వేదిక సభలో సీఎం
- కర్నూలు-బళ్లారి జాతీయ రహదారిగా మారుస్తాం

కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు సాగునీరివ్వడం నాకో పెద్ద సవాలు.. గుండ్రేవుల, గురు రాఘవేంద్ర.. ఆర్డీఎస్.. వేదవతి ప్రాజెక్టులను పూర్తి చేస్తాం.. పొలాలకు సమృద్ధిగా సాగు నీరు అందిస్తాం.. కర్నూలు నుంచి బళ్లారి వరకు జాతీయ రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.. ఓర్వకల్లును పారిశ్రామిక హబ్‌గా మారుస్తాం.. కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటుచేసేందుకు చర్యలు వేగవంతం చేశాం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. "పేదల సేవ" కార్యక్రమంలో భాగంగా పత్తికొండ మండలం పుచ్చకాయలమడలో మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. గ్రామంలో కొందరు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించి వారి యోగ క్షేమాలు తెలుసుకొన్నారు.. అనంతరం 'ప్రజావేదిక.. పేదల సేవ' సభలో మాట్లాడారు. పత్తికొండ ప్రాంతంలో హంద్రీనీవా ప్రధాన కాల్వ నుంచి అన్ని చెరువులకు నీళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకొని పనులు ప్రారంభించాం.. వైకాపా ప్రభుత్వ హయాంలో ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదన్నారు.. పుచ్చకాయలమడకు హంద్రీనీవా నీరు తీసుకొస్తామన్నారు. స్వర్ణాంధ్ర*2047 ప్రణాళిక తీసుకొస్తున్నాం.. తెలుగువారు ముందు ఉండాలన్నదే లక్ష్యం.. ఎక్కడెక్కడ సమస్యలు ఉన్నాయో డ్రోన్ టెక్నాలజీ ద్వారా గుర్తించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చడానికి చర్యలు వేగవంతం చేసినట్లు సీఎం ప్రకటించారు. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి చేయడం ద్వారా రాయలసీమ ప్రాంతంలో యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు.

ఈనాడు, కర్నూలు, న్యూస్‌టుడే, పత్తికొండ, పత్తికొండ గ్రామీణం

ఇంటికే కదిలొచ్చిన ఆసరా

వేదన నిండిన గుండెల్లో ఆనందం వెల్లివిరిసింది. ఐదేళ్లలో ఎదురైన కష్టాలు తొలగిన సంతోషం. ఇంటికే కదిలొచ్చిన ఆసరా.. తలుపు తట్టిన భరోసా. స్వయంగా ముఖ్యమంత్రే తమకు పింఛను అందించేందుకు వచ్చారని గ్రామస్థులు సంబరాల్లో మునిగితేలారు. మధ్యాహ్నం 1.15 గంటలకు గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు తలారి గంగమ్మ, చింతగింజల వెంకటేశ్‌ల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. పింఛన్ అందజేసి వారి యోగక్షేమాలు తెలుసుకొన్నారు. కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

చెల్లెమ్మలూ క్షేమమేనా..!


మధ్యాహ్నం 2.50 గంటకు ప్రజావేదిక సభ ప్రారంభం కాగానే ప్రజలకు అభివాదం చేస్తూ.. చెల్లెమ్మలు క్షేమమేనా.. తమ్ముళ్లూ కుశలమేనా.. అని పలకరించడంతో సభలో హర్షధ్వానాలు వినిపించాయి. ఐదేళ్ల కాలంలో తమ్ముళ్ల ముఖాల్లో చిరునవ్వులు చూడలేదని, మన ప్రభుత్వం రాగానే వారిలో ఆ ఆనందం కనిపిస్తోందని యువతను చూపుతూ.. ఆయన మాట్లాడారు. మూడు గంటల సేపు గ్రామస్థులతో గడపడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. సాయంత్రం 4.38 గంటలకు గ్రామం నుంచి బయలుదేరారు.

ఆదుకోని ఆరోగ్యశ్రీ

● రెండు మూత్రపిండాలు పాడయ్యాయి.. చికిత్స పొందే సమయంలో మంత్రి టీజీ భరత్ నాకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించి ప్రాణాలు కాపాడారు. వైకాపా హయాంలో ఆరోగ్యశ్రీ పథకం సక్రమంగా అమలు కాలేదు. నాలాంటి బాధితులు ఎంతో మంది ఉన్నారు. రూ.లక్షలు ఖర్చు చేయలేక, జబ్బు నయంకాక నరక యాతన అనుభవిస్తున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా పేదోడికి న్యాయం చేయాలి.

– సురేశ్, కిడ్నీ బాధితుడు

ముఖ్యమంత్రి: ఆరోగ్యశ్రీ పథకం మరింత మందికి ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటాం. సేవలు మరింత విస్తరిస్తాం. కొన్ని వ్యాధుల బారిన పడిన బాధితులను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటాం.



ముఖాముఖిలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



ఇల్లు మంజూరు చేయండి

ఇంటి కోసం చాలాసార్లు దరఖాస్తు చేశా. పేరు నమోదు చేసుకుంటున్నారు తప్ప మంజూరు కావడం లేదు. కొత్త ప్రభుత్వంలో గూడు నిర్మించుకోవచ్చని ఆశతో ఉన్నాం. ఇల్లు మంజూరు చేసి ఆదుకోండి.– నాగవేణి, గృహిణి

ముఖ్యమంత్రి: తక్షణమే ఇల్లు మంజూరు చేస్తాం.

ఆటోతో ఉపాధి చూపండి

ఊరిలో ఉపాధి ఉండటం లేదు. వ్యాపారం చేసుకునేందుకు ఆర్థిక స్తోమత లేదు. విద్యుత్తుతో నడిచే ఆటో ఇప్పిస్తే.. నడుపుకొంటూ జీవనం సాగిస్తా. నాపైనే ఆధారపడిన కుటుంబాన్ని ఆదుకోవాలి. – అశోక్

ముఖ్యమంత్రి: వెంటనే యువకుడికి ఆటో అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రంజిత్‌బాషాను ఆదేశించారు.

పుచ్చకాయలమడకు సీఎం వరాల జల్లు

పుచ్చకాయలమడలో రూ.1.38 కోట్లతో అంతర్గత రహదారుల నిర్మాణం, రూ.20 లక్షలతో ఉన్నత పాఠశాల ప్రహరీ, రూ.30 లక్షలతో కమ్యూనిటీ భవన నిర్మాణం, మినీ గోకులాల షెడ్లు, నీటి కుంటలు, పూడికతీత తదితర పనులు మరో రూ.87.75 లక్షలతో చేపట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 203 మందికి ఇళ్లు, 48 మందికి కొత్త పింఛన్లు, 15 మందికి రేషన్‌కార్డులు, ఐదుగురికి ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు, 135 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు, 105 ఇళ్లకు మరుగుదొడ్లు ఏర్పాటు చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



ప్రగతి పైలాన్ ఆవిష్కరిస్తున్న సీఎం

ఆరు నెలల్లో జ్యూస్ పరిశ్రమ

– టీజీ భరత్, మంత్రి



పత్తికొండ ప్రాంతంలో టమాటా జ్యూస్ పరిశ్రమను ఆరు నెలల్లో పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. స్థలం వివాదంలో ఉంది. త్వరలోనే పరిష్కరిస్తాం.

కర్ణాటక రాష్ట్రాన్ని కలిపేలా..

– బస్తిపాటి నాగరాజు, ఎంపీ



కర్నూలు పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాలను కలుపుతూ కర్ణాటకలోని బళ్లారి వరకు హైవే నిర్మించాలి. ఆలూరు నియోజకవర్గంలో తాగు, సాగు నీటి కష్టాలు తీర్చేందుకు చేపట్టిన ప్రాజెక్టులు పూర్తి చేయాలి.

68 చెరువులు నింపాలి

– కేఈ శ్యాంబాబు, ఎమ్మెల్యే




హంద్రీనీవా కాల్వకు ఇరువైపులా ఉన్న 68 చెరువులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి నింపాలి. పత్తికొండ ప్రాంతంలో పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలి. చెరువు పనులను తక్షణమే అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలి.

దసరాకు పప్పన్నం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : దసరా నేపథ్యంలో రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులకు కందిపప్పు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రేషన్ సరకుల పంపిణీలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయి. తూకాల్లో తేడాలుండటంతో జులై నుంచి కందిపప్పు పంపిణీ ఆపేశారు. సక్రమమైన కొలత, కొత్త ప్యాకింగ్‌తో సెప్టెంబరు నుంచి లబ్ధిదారులకు పంచదార పంపిణీ చేస్తున్నారు. అక్టోబరు నుంచి కందిపప్పు సైతం లబ్ధిదారులకు ఇస్తున్నట్లు పౌరసరఫరాల అధికారులు తెలిపారు. కిలో కందిపప్పును రూ.67కు అందించనున్నారు.

కర్నూలు జిల్లాలో మొత్తం ఏడు ఎంఎల్ఎస్ పాయింట్ గోదాములున్నాయి. జిల్లాలో 6.76 లక్షల మంది కార్డుదారులు ఉండగా నెలకు 676 టన్నుల కందిపప్పు అవసరమవుతుంది. అక్టోబరు నెలకు సగానికి పైగా కేటాయింపులు చేశారు. అందులో మొదటి విడతగా కర్నూలుకు 10, ఎమ్మిగనూరు 10, పత్తికొండకు 20 టన్నుల కందిపప్పు సరఫరా చేశారు. గూడూరు, ఆలూరు, వెల్దుర్తి ఎంఎల్ఎస్ పాయింట్లకు కందిపప్పు రాలేదు. త్వరలో వస్తుందని అధికారులు చెబుతున్నారు.



కందిపప్పు ప్యాకెట్లతో పాటు విడిగా డీలర్లుకు స్టిక్కర్ల పంపిణీ

మొదటి రోజు కొందరికే..

ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమం మంగళవారం నుంచి ఎండీయూ వాహనాల ద్వారా ప్రారంభమైంది. మొదటి రోజు కర్నూలు జిల్లాలో 43,578 మంది కార్డుదారులకు 6.44 శాతం సరకులు పంపిణీ చేయగా.. నంద్యాల జిల్లాలో 29,888 మంది కార్డుదారులకు 5.51 శాతం రేషన్ పంపిణీ జరిగింది. మొదటి రోజు రేషన్ పంపిణీలో కర్నూలు జిల్లాలో 1,979, నంద్యాల జిల్లాలో 531 మంది కార్డుదారులకు కందిపప్పు ఇచ్చారు. ప్రస్తుతం చౌక దుకాణాలకు కందిపప్పు సర్దుబాటు చేశామని.. బుధవారం నుంచి బియ్యం, పంచదారతోపాటు కందిపప్పు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని పౌరసరఫరాల అధికారులు తెలిపారు.

అరకొర సరకు పంపిణీ చేయలేం

ఒక్కో చౌక దుకాణానికి 35 కిలోల కందిపప్పు సరఫరా చేస్తే.. ఆ సరకును కార్డుదారులకు సరఫరా చేయలేమని ఇటు చౌక దుకాణాల డీలర్లు, అటు ఎండీయూ ఆపరేటర్లు చెబుతున్నారు. ఆ 35 కిలోల కందిపప్పు తీసుకెళ్తే కార్డుదారులు తిరగబడతారని కొందరు ఎండీయూ ఆపరేటర్లు వాపోతున్నారు. వచ్చిన సరకును వచ్చినట్లు చేరవేస్తామంటూ పౌరసరఫరాల అధికారులు, ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌ఛార్జులు చౌక దుకాణదారులకు నచ్చజెప్పే ప్రయత్నాలు చేస్తున్నారు.

మహాత్ముని మాట.. కూటమి బాట

- పల్లె ప్రగతికి ప్రత్యేక ప్రణాళిక
- పంచాయతీ ఖాతాల్లో రూ.56.10 కోట్లు
- రూ.83 కోట్ల ఉపాధి నిధులతో రహదారులు

పల్లెలు దేశానికి పట్టుగొమ్మలు.. అవి పచ్చగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది.. గ్రామ స్వరాజ్యం సాధనలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమైంది.. స్థానిక సంస్థలు స్వపరిపాలన చేసినప్పుడే అది సాధ్యమవుతుంది. - మహాత్మా గాంధీ మాట.

నేడు గాంధీ జయంతి


కర్నూలు జడ్పీ, న్యూస్‌టుడే:

ఊళ్లకు ఉరి వేసిన జగన్

జాతి నిర్మాతల ఆశయాలు.. రాజ్యాంగ అధికరణలను గత ఐదేళ్ల జగన్ అడుసులో తొక్కేశారు. ఊరంటే జనం కాదు.. బంధం, బంధుగణం ఐక్యతకు తార్కాణం. ఊరికి ఏం కావాలో అంతా ఏకమై చెప్పుకొనే స్వాతంత్ర్యాన్ని లాక్కొన్నారు. పల్లె ఖజానాను కొల్లగొట్టి.. అభివృద్ధికి అడ్డుకట్ట వేశారు. సర్పంచులను చులకన చేశారు.. ఆటబొమ్మలుగా మార్చారు. గ్రామ స్వరాజ్యానికి సమాధి కట్టారు. పల్లెల్లో ప్రగతి దీపాలను స్వహస్తాలతో కొండెక్కించారు.

కూటమి పల్లెకు వందనం

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పల్లె ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆగస్టు 23న ఉమ్మడి జిల్లాలోని 970 పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి నిధులతో గ్రామాల్లో చేపట్టాల్సిన వివిధ పనులపై ప్రజలు, అధికారులు చర్చించి తీర్మానాలు చేశారు. వీటికి అనుమతి లభించడంతో ఉమ్మడి జిల్లాలో ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు.



స్వర్ణాంధ్ర-2047 లక్ష్యంగా

కూటమి ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ప్రతి పల్లెలో అన్ని వసతులు కల్పించాలని నిర్ణయించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రహదారులు లేని గ్రామాల్లో చేయాల్సిన ప్రత్యామ్నాయ పనులపై కసరత్తు జరుగుతోంది. కర్నూలు జిల్లాలో రహదారులు లేని 11 గ్రామాలను గుర్తించారు. వీటికి రూ.9.50 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. చెంచుగూడేలకు నిధులు కేటాయించే క్రమంలో కొత్తపల్లి మండలం జానాలగూడెం గ్రామానికి 'పీఎం జన్‌మన్' పథకం కింద రూ.4.40 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇక్కడ పూర్తిస్థాయిలో ఎస్టీలు జీవనం సాగిస్తున్నారు. సంగమేశ్వరం ఆలయం నుంచి జానాలగూడెం వరకు గల 7 కి.మీ.ల విస్తీర్ణంలో రహదారి నిర్మాణం చేపట్టనున్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వచ్చే అయిదేళ్లలో రహదారి లేని గ్రామం ఎక్కడా ఉండకూడదనే దిశగా కూటమి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఉప ముఖ్యమంత్రి మంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. ఉపాధి నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, కాలువలు, వీధి దీపాలు, మంచినీరు, స్వచ్ఛత తదితర పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉపాధి నిధుల తోపాటు వివిధ పద్దుల కింద వచ్చే అయిదేళ్లలో 1,232 పనులు చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. దీనికి రూ.3,140 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు.

మార్గం సుగమం

ఒక్కో మండలానికి రూ.2 కోట్ల ఉపాధి నిధులు కేటాయించారు. గ్రామాల్లో సీసీ రహదారులు, కాలువల నిర్మాణానికి వీటిని వెచ్చించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 1,065 పనులు చేపట్టేందుకు రూ.83 కోట్లు కేటాయించారు. ఈనెల 14వ తేదీ నుంచి వారం రోజుల పాటు పండగ వాతావరణంలో ఆయా నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉపాధి నిధులతో చేపట్టే రహదారుల పనులను లాంఛనంగా ప్రారంభించనున్నారు.

ఇంటింటికి మంచినీరు

2019లో ప్రారంభమైన జల్‌జీవన్ మిషన్‌ను అప్పటి వైకాపా ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. నంద్యాల జిల్లాలో రూ.115 కోట్ల వ్యయంతో 522 పనులకు అనుమతి ఇవ్వగా రూ.82 కోట్లతో 232 పనులు మాత్రమే పూర్తి చేశారు. కర్నూలులో 1,026 పనులకు 293 పనులు పూర్తి చేసి. సుమారు రూ.197 కోట్లు ఖర్చు చేసినా ఎలాంటి ఫలితం దక్కలేదు. చాలా నిధులు పక్కదారి పట్టాయి. దీనిపైనా కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

ఉమ్మడి జిల్లాలో పంచాయతీలు: 970 ↕ జనాభా (2011): 28.07 ↕ లక్షలు 15వ ఆర్థిక సంఘం నిధులు: రూ.56.10 కోట్లు

మార్కెట్‌లో మోసాలపై ఫిర్యాదు చేయండి



ఉల్లి తూకాలను పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ కార్యదర్శి జయలక్ష్మి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో "ఉల్లి రైతుల వెలవెల" శీర్షికన మంగళవారం ఈనాడులో కథనం ప్రచురితమైంది. స్పందించిన మార్కెట్ కమిటీ కార్యదర్శి జయలక్ష్మి పర్యవేక్షక సిబ్బందితో కలిసి ఉల్లి క్రయ, విక్రయాలను పరిశీలించారు. తూకాలను తనిఖీ చేశారు. యార్డులో మోసాలు జరిగితే తక్షణమే మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంట ఉత్పత్తుల కొనుగోళ్ల సమయంలో యార్డు సిబ్బంది తప్పనిసరిగా పర్యవేక్షించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో 204 మద్యం దుకాణాలు

- ప్రకటన విడుదల చేసిన అధికారులు

ప్రాంతం	ఎన్ని దుకాణాలు
కర్నూలు (నగరపాలక సంస్థ)	20
కర్నూలు మండలం	4
కల్లూరు	3
ఓర్వకల్లు	4
గూడూరు పంచాయతీ	2
గూడూరు	1
కోడుమూరు	5
సి.బెళగల్	2
కృష్ణగిరి	1
వెల్దుర్తి	3
ఎమ్మిగనూరు మున్సిపాలిటీ	8
ఎమ్మిగనూరు	3
మంత్రాలయం	2
నందవరం	2
ఆదోని పురపాలక	8
ఆదోని	2
కౌతాళం	2
పెద్దకడబూరు	2
ఆలూరు	2
హొళగుంద	2
ఆస్పరి	2
హాలహర్వి	2
చిప్పగిరి	1
పత్తికొండ	5
దేవనకొండ	3
తుగ్గలి	2
గోనెగండ్ల	3
మద్దికెర	1

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు జిల్లాలో 99.. నంద్యాలలో 105 మద్యం దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.. 2024-26 సంవత్సరానికి సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అందుకు ఈ నెల 9వ తేదీ గడువు విధించినట్లు.. ఒక్క దరఖాస్తుకు రూ.2 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని.. ఒక అభ్యర్థి ఒకే దుకాణానికి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు.. దరఖాస్తు రుసుము వెనక్కి ఇవ్వరు.. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చు.. అభ్యర్థులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, హైబ్రీడ్ అనే మూడు పద్ధతుల్లో దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు పేర్కొన్నారు.

ఎక్కడి నుంచైనా

ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌shttps:hpfspoject.comz ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. పేరు, వివరాలు, గుర్తింపుకార్డు వివరాలు నమోదు చేస్తే చాలు. ఆన్‌లైన్‌పై అవగాహన లేనివారు స్థానిక మద్య నిషేధ, అబ్కారీ స్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చు. దీనికిగాను స్టేషన్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేశారు. బ్యాంకు ఉద్యోగి, సచివాలయ ఉద్యోగి, ఆబ్కారీ శాఖ అధికారి అందుబాటులో ఉంటారు. వారే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయిస్తారు. హైబ్రీడ్ పద్ధతైన మూడో విధానంలో బ్యాంకులో చలానా తీసుకుని దాని ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంత రుసుము చెల్లించాలంటే

జనాభా, ప్రాంతాల ప్రాతిపదికన అనుమతుల రుసుమును ప్రభుత్వం నిర్ణయించింది. హాలహర్వి, మద్దికెర, గూడూరు, కృష్ణగిరి మండలాల్లో ఏడాది అనుమతుల రుసుము రూ.55 లక్షలు, రెండో ఏడాది రూ.60.50 లక్షలు చెల్లించాల్సి ఉంది. కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, ఇతర అన్ని మండల కేంద్రాల్లో మొదటి ఏడాది రూ.65 లక్షలు, రెండో ఏడాది రూ.71.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది.



ఆబ్కారీ శాఖ కార్యాలయంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి, అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు

11న లక్కీడిప్

ఈనెల 11న కర్నూలు జిల్లాకు సంబంధించి నగరంలోని జడ్పీ సమావేశ భవనంలో లక్కీడిప్ ప్రక్రియ నిర్వహించి దుకాణాలు కేటాయిస్తారు. రెండు డిప్‌లు తీసి మొదట ఎంపికైన వ్యక్తికి ఇస్తారు. రెండో డిప్‌ను రిజర్వ్‌లో ఉంచుతారు. మొదటి వ్యక్తి అనుమతి తీసుకోనిపక్షంలో రెండో డిప్ వ్యక్తికి కేటాయిస్తారు. దరఖాస్తుదారు మాత్రమే లక్కీడిప్‌లో పాల్గొనాల్సి ఉంటుంది.

ఆరో వంతు అక్కడికక్కడ చెల్లించాల్సిందే..

- లక్కీడిప్‌లో అనుమతులు దక్కించుకున్న వ్యక్తి.. అనుమతుల రుసుములో ఆరో వంతు చెల్లించాల్సి ఉంది. సదరు వ్యక్తి నిబంధనలకు అనుగుణంగా దుకాణం ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది.
- అనుమతుల రుసుము ప్రతి రెండు నెలలకోసారి చెల్లించాల్సి ఉంటుంది.
- అనుమతుల ద్వారా వచ్చిన ఆదాయంలో 2 శాతం నిధులను మత్తు పదార్థాల నిరోధక చర్యలకు ప్రభుత్వం కేటాయిస్తుంది.
- ఈడిగ సామాజిక వర్గానికి రిజర్వ్ చేసిన దుకాణాల అనుమతులకు సంబంధించి ప్రత్యేక ప్రకటన వెలువడుతుంది. ప్రీమియం దుకాణం ఏర్పాటుకు సంబంధించి ప్రత్యేక ప్రకటన ఇస్తారు.

విద్యార్థి జీవితానికి విజ్ఞానవోదయం

☛ 2025-26 విద్యా సంవత్సరానికి నూతన ప్రకటన

☛ ఈ నెల 7వ తేదీ వరకు గడువు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్య ఉత్తమ విలువలు, నైపుణ్యాలు, దేశ భక్తి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, ఎన్‌సీసీ వంటి వాటికి పేరొందింది జవహర్ నవోదయ విద్యాలయం. సామాన్య, బడుగు, బలహీనవర్గాల పేద విద్యార్థులకు సకల వసతులతో కూడిన విద్య నందించడం నవోదయ ప్రధాన ఉద్దేశం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎమ్మిగనూరు బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో చదివిన విద్యార్థులు ఎందరో ఉన్నత శిఖరాలకు చేరారు. ఈ విద్యాలయంలో చేరేందుకు 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఈ నెల 7వ తేదీ వరకు గడువు ఉంది.


చదువుకుంటున్న విద్యార్థులు

విద్యాలయంలో వసతులు

- గ్రంథాలయం : 10,800 పుస్తకాలు (ఆంగ్ల నిఘంటువులు, తెలుగు, హిందీ భాషా పుస్తకాలు)
- శిక్షణ : ఐఐటీ, నీట్, ఎన్ఐటీ, ఏఐఈఈఈ, ఎయిమ్స్, ఎన్‌సీఆర్టీ
- గదులు: 1:40 నిష్పత్తిలో కూర్చునేందుకు అనువుగా
- మైదానం: ఉదయం 6 గంటల నుంచి 8 గంటలు, సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్రీడలు. ఖోఖో, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ ఆడేందుకు విశాలమైన మైదానం. త్రోబాల్, ఇతర పోటీల నిర్వహణకు ప్రత్యేక మైదానాలు తీర్చిదిద్దారు.
- ప్రయోగశాలలు: 4
- విద్యాలయం విస్తీర్ణం : 32 ఎకరాలు
- విద్యార్థుల సంఖ్య : 470
- ప్రత్యేకతలు: బాలుర, బాలికలకు వేర్వేరుగా భోజనశాల, డార్మెటరీ హాలు.
- వసతి: 10 బ్లాకులు, ఒక్కో గదిలో నలుగురు చొప్పున వసతి
- ఏటా భర్తీ చేసే సీట్లు: 80 మంది
- తరగతులు: 6 నుంచి 12వ తరగతి వరకు
- విద్యార్థులకిచ్చే ఆహారం : ఉదయం రాగి జావా, స్నాక్స్, టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం

దరఖాస్తు ఇలా చేసుకోవాలి

- https:///cbseitems.rcil.gov.in /nvs వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- 1-5-2013 నుంచి 31-07-2015 మధ్య జన్మించాలి.
- విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తి చేసి ఇటీవల తీసుకున్న పాస్‌పోర్టు ఫొటో అతికించి సంతకం పెట్టాలి. తల్లిదండ్రులు లేక సంరక్షకులతో సంతకం చేయించాలి. ఐదో తరగతి చదువుకున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ద్వారా ధ్రువీకరించి తిరిగి దానిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- దరఖాస్తుకు చివరి తేదీ : 7-10-2024
- పరీక్ష నిర్వహణ : 18-1-2025
- సీట్లు : 80
- అర్హత : ఉమ్మడి జిల్లా విద్యార్థుల దరఖాస్తులు

ప్రణాళిక ప్రకారం చదివిస్తాం - పద్మావతి, ప్రధానాచార్యులు

-బనవాసి నవోదయ విద్యాలయం



ఉత్తమ బోధనతోపాటు ప్రణాళిక ప్రకారం చదివిస్తాం, ఎక్కడా ఒత్తిడి చేయం. చిన్నారులతో స్నేహ పూర్వకంగా ఉంటాం. ప్రయోగ శాలల్లో పూర్తిగా అవగాహన కల్పిస్తాం. ఒకటి, రెండుసార్లు ఆలోచించేలా తర్ఫీదు ఇస్తాం. ప్రతిరోజూ తరగతి ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుంది. పిల్లలకు ఏదైనా అనారోగ్యం తలెత్తినప్పుడు వెంటనే స్పందించి వైద్యమందిస్తాం.

ఆసనాల యోగం.. పతకాల భాగ్యం

☛ పోటీల్లో రాణిస్తున్న కస్తూర్బా బాలికలు ☛ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నిరుపేదలే.. ఆరోగ్యంలో ధన వంతులు. కర్నూలుకు చెందిన ఆసనాలు వేస్తూ.. యోగాసనా లతో ఎత్తుకు ఎదిగారు. స్నేహానికి ప్రాణమి స్తారు.. బరిలో దిగితే పతకాలు సాధిస్తారు. చదువుల్లో ముందుంటారు.. ఆటలో గెలుపొందారు. ఆటంకాలను దాటేస్తారు.. విజయాలు చేపడతారు. ఆసనాల పోషాకం పట్టారు.. పోటీల్లో ప్రత్యేకతను చాటారు. ఆదోని పట్టణంలోని కస్తూర్బా బాలికల(జనరల్) ఉన్నత పాఠశాలలో చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. - న్యూస్‌టుడే, ఆదోని క్రీడలు

ఆదోని పట్టణంలోని కస్తూర్బా బాలికల(జనరల్) ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులు యోగాలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. ప్రిన్సిపల్ శాంతి, వ్యాయామ ఉపాధ్యాయిని సునంద విద్యార్థినులతో నిత్యం సాధన చేయిస్తున్నారు. కఠినమైన ఆసనాలు సైతం విద్యార్థినులు అవలీలగా వేస్తున్నారు. యోగాతో మానసిక ప్రశాంతతతో పాటు చదువుపై ఆసక్తి పెరగడం, ఆరోగ్యం, ఏకాగ్రత పెరుగుతోందంటున్నారు శిక్షకులు. రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థినులు సన్నద్ధమవుతున్నారు.

మమత.. పోటీలో ఘనత



ఎమ్మిగనూరు మండలం గువ్వలదొడ్డి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మహేశ్వరమ్మ దంపతుల కుమార్తె బి.మమత 8వ తరగతి చదువుతోంది. రెండేళ్లుగా వ్యాయామ ఉపాధ్యాయిని సునంద వద్ద యోగాలో ప్రత్యేక శిక్షణ తీసుకుంటోంది. కర్నూలు నగరంలో జరిగిన యోగా పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. యోగాతో ఆరోగ్యం బాగుండటంతో పాటు ఏకాగ్రత పెరిగిందని.. కష్టపడి చదవి వైద్యురాలిగా స్థిరపడి ప్రజలకు సేవ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నానని.. అందుకు తగినట్లుగా చదువుతున్నానని చెబుతోంది విద్యార్థిని మమత.

గాయత్రి గెలుపు మంత్రం



ఆస్పరి మండలం పుప్పాలదొడ్డి గ్రామానికి చెందిన ఈశ్వరప్ప, ముత్తమ్మ దంపతుల కుమార్తె సి.గాయత్రి ఏడో తరగతి చదువుతోంది. యోగాపై ఆసక్తితో ప్రత్యేక శిక్షణ తీసుకుంటోంది. పలు ఆసనాలు అవలీలగా వేస్తూ.. ఆకట్టుకుంటోంది. రాష్ట్ర స్థాయి పోటీలకు సన్నద్ధమవుతున్నాను.. ఈ పోటీలో విజయం సాధిస్తానని చెబుతోంది గాయత్రి. కష్టపడి చదవి ఉపాధ్యాయినిగా స్థిరపడాలని లక్ష్యం పెట్టుకున్నానంటోంది.

దీపిక.. విజయాల మాలిక



ఆస్పరి మండలం ముత్తుకూరుకు చెందిన మల్లేటి, కృష్ణవేణి దంపతుల కుమార్తె జె.దీపిక ఎంపీసీ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. వీరిది రైతు కుటుంబం. యోగాసనాలు వేయడంతో తనకు తానే సాటి అన్నంతగా పట్టు సాధించింది. కర్నూలు నగరంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విద్యార్థిని దీపిక ప్రతిభ చాటి అందరి ప్రశంసలు పొందింది. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కష్టపడి చదవి ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించటం తన లక్ష్యమని చెబుతోంది. యోగాలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రత్యేకతను చాటుతానని చెబుతోంది దీపిక.

అర్హులందరికీ పింఛన్లు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని ఎన్ఆర్ పేటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన లబ్ధిదారులకు పింఛను సొమ్ము అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నారని చెప్పారు. పెరిగిన పింఛను సొమ్ము తీసుకున్న లబ్ధిదారులు ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. కాలనీల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఎన్టీఆర్ భరోసా పింఛన్లలో భాగంగా మంగళవారం మొదటి రోజు కర్నూలు జిల్లాలో 98.27 శాతం, నంద్యాల జిల్లాలో 97.71 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కర్నూలు జిల్లాలో 2,41,843 మందికిగాను 2,37,659, నంద్యాల జిల్లాలో 2,18,225 మందికిగాను 2,13,226 మందికి పింఛను సొమ్ము పంపిణీ చేశారు. ఒకటి రెండు రోజుల్లో వంద శాతం పంపిణీ ప్రక్రియ పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.


పింఛను సొమ్ము అందజేస్తున్న మంత్రి టీజీ భరత్

ప్రత్యేక సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయ కళాశాలల్లో చదువుతూ 3, 4వ ఏడాదిలో తప్పిన అభ్యర్థులకు స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నాయని, అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015, 2016, 2017, 2018 సంవత్సరాల్లో తప్పిన అభ్యర్థులు ఈనెల 16వ తేదీలోపు తగిన రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : నంద్యాల మీదుగా విశాఖ పోర్టుకు పెట్రోలు వ్యాగన్లతో వెళ్తున్న గూడ్స్ రైలు మంగళవారం తెల్లవారుజామున పట్టాలు తప్పింది. నంద్యాల రైల్వేస్టేషన్‌లోని ఐదో లైన్‌లో చివరి మూడు వ్యాగన్లు పట్టాలు తప్పాయి. ఈ విషయాన్ని గుర్తించిన లోకో పైలట్ వెంటనే గూడ్స్‌ను ఆపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

దసరా మహోత్సవాలకు ముస్తాబైన శ్రీగిరి

● రేపటి నుంచి నవదుర్గ అలంకారాల్లో అమ్మవారి దర్శనం


విద్యుద్దీపాలంకరణలో ఆలయ ముందుభాగం

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల మహాక్షేత్రం దసరా మహోత్సవాలకు ముస్తాబైంది. గురువారం నుంచి ఈ నెల 12 వరకు దసరా మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో డి.పెద్దిరాజు మంగళవారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా భ్రమరాంబాదేవి నిత్యం రాత్రి 7 గంటలకు నవదుర్గ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్వామిఅమ్మవార్లకు ఆలయ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈవో చెప్పారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణాలను విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేస్తున్నారు. తొలి రోజు గురువారం ఉదయం 8 గంటలకు భ్రమరాంబాదేవి ఆలయ యాగశాల ప్రవేశం చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ నెల 11న రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పించనున్నారు. 12న విజయదశమి పర్వదినం పురస్కరించుకుని ఉదయం 9.45 గంటలకు రుద్రయాగ పూర్ణాహుతి, కలశోద్వాసన, వసంతోత్సవం, అవబృథం, త్రిశూలతీర్థోత్సవం క్రతులు జరుగుతాయి. రాత్రి 8 గంటలకు స్వామిఅమ్మవార్లకు తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని ఈవో వెల్లడించారు.

తేదీ	అలంకరణ	వాహన సేవలు
3	శైలపుత్రి	భృంగి
4	బ్రహ్మచారిణి	మయూర
5	చంద్రఘంట	రావణ
6	కూష్మాండదుర్గ	కైలాస
7	స్కందమాత	శేష
8	కాత్యాయని	హంస
9	కాళరాత్రి	గజ
10	మహాగౌరి	నంది
11	సిద్ధిదాయిని	అశ్వ
12	భ్రమరాంబాదేవి (నిజరూపాలంకరణ)	నంది

పురుషుల కబడ్డీ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: ఆటలు శారీరక, మానసిక వికాసానికి అవసరమని, విద్యార్థులు నిత్యం క్రీడలు ఆడాలని ఆర్‌యూ ఉపకులపతి ఆచార్య ఎన్‌టికే నాయక్ సూచించారు. నగరంలోని ఆర్‌యూ క్రీడా మైదానంలో ఆర్‌యూ అనుబంధ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ఆచార్య మూర్తయ్య, డా.జి.చంద్రశేఖర్, శ్రీనివాసులులతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమానికి ఆర్‌యూ క్రీడల సమన్వయకర్త శివకిషోర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఆర్‌యూ అనుబంధ కళాశాలలకు చెందిన 16 జట్లు పోటీల్లో నిలిచాయన్నారు. శ్రీలక్ష్మి బీపీడీ కళాశాల జట్టు, ఏపీ ఆదోని జట్టు, ఆదోని జ్యోతిర్మయి కళాశాల జట్టు, నంద్యాల పీఎస్‌సీ జట్టు, కర్నూలు ఉస్మానియా డిగ్రీ కళాశాల జట్టు, నందికొట్కూరు బసిరెడ్డి కళాశాల జట్లు పోటీల్లో విజయం సాధించాయి.

స్వచ్ఛతాహి సేవా ముగింపు నేడు


కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, అధికారులు

కర్నూలు నగరం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛతకు ప్రధాని మోదీ పిలుపు మేరకు గత నెల 17 నుంచి నిర్వహించిన స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ముగియనుంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పద్నాలుగు రోజులుగా అనేక స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని 970 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లాల డీపీవోలు టి.నాగరాజనాయుడు, మంజులవాణిలు ఒక ప్రకటనలో తెలిపారు. శాంతి ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో కర్నూలు శరీన్‌నగర్ కాలనీలోని ఉన్నత పాఠశాలలో శక్తి సదన్ మహిళలు మంగళవారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాత, సంస్థ కార్యదర్శి విజయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తాం

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: నాణ్యమైన టెలికాం సేవలు అందించడంలో బీఎస్ఎన్ఎల్ ముందు ఉంటుందని జనరల్ మేనేజర్ జి.రమేశ్ తెలిపారు. భారత ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ 25వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకొని మంగళవారం ప్రకాశ్‌నగర్‌లోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి ర్యాలీని ఆయన ప్రారంభించారు. నగరపాలక కార్యాలయం, కొండారెడ్డి బురుజు, కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజేశ్వరరావు, ఏడీ శ్రీలత, ఏజీఎం ఆపరేషన్ పి.శ్రీనివాసరావు, ఏజీఎం అడ్మిన్ శ్రీనునాయక్, ఏజీఎంలు నారాయణస్వామి, చంద్రశేఖర్, మురళీకృష్ణ, జాన్సన్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

సహకార బ్యాంకులో అక్రమాలపై విచారణ

☛ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : ఆత్మకూరు సహకార బ్యాంకులో రూ.77 లక్షల స్వాహా చేసిన ఘటనపై సమగ్ర విచారణకు సీఈవో విజయ్‌కుమార్ ఆదేశించారు. ఏజీఎం గీతతోపాటు మరో నలుగురు బ్యాంకు అధికారులతో సమగ్ర విచారణకు ఆదేశించామన్నారు. బుధవారం సాయంత్రంలోగా విచారణ పూర్తి చేసి నివేదికలివ్వాలని పేర్కొన్నారు. ఘటనపై బ్యాంకు అధికారులు మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారిని కలిశారు.

● సీఈవో విజయ్‌కుమార్, జీఎం శివలీల, డీజీఎం ఉమామహేశ్వరరెడ్డి తదితరులు మంగళవారం బ్యాంకును సందర్శించారు. క్యాషియర్ అల్తాఫ్, అసిస్టెంట్ మేనేజర్ రంగయ్యను విచారించారు. తన సొంత వ్యాపారానికి రూ.77 లక్షలు వాడుకున్నట్లు క్యాషియర్ అల్తాఫ్ అధికారుల ఎదుట ఒప్పుకొన్నారు. అనంతరం బ్యాంకు అధికారులు ఆత్మకూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


చంద్రబాబుకు చెక్కు అందజేస్తున్న తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, కొట్రేష్‌గౌడ్

ముఖ్యమంత్రికి రూ.లక్ష చెక్కు అందజేత

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప రూ.లక్ష విరాళాన్ని అందించారు. మంగళవారం ఆయన కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కు అందజేశారు. ఆయన వెంట మంత్రాలయం నియోజకవర్గ రైతు సంఘం కార్యదర్శి కొట్రేష్‌గౌడ్, బాపురం శివమోహన్‌రెడ్డి తదితరులున్నారు.

సుప్రీంకోర్టు విశ్రాంత జడ్జితో విచారణ చేయించాలి

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: హిందువులకు ప్రీతిపాత్రమైన తిరుమల లడ్డూ కల్తీ విషయంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు జడ్జితో విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి కోరారు. లడ్డూ కల్తీ నేపథ్యంలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్, హిందూ ధార్మిక సంఘాలు, కుల సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నగరంలోని కొండారెడ్డి బురుజు నుంచి ర్యాలీ నిర్వహించారు. కోట్ల సర్కిల్, కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్ సెంటర్, మెడికల్ కళాశాల, కలెక్టరేట్ వరకు ర్యాలీ సాగింది. ఆయన మాట్లాడుతూ.. పవిత్ర ఆలయాల నిర్వహణ బాధ్యతలను హిందూ ధార్మిక సంస్థలకు అప్పజెప్పాలని డిమాండ్ చేశారు. హిందూ ఆలయాల్లో అన్యమతస్తులను తప్పించాలన్నారు. అనంతరం డీఆర్వో చిరంజీవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు టీసీ.మద్దిలేటి, రాష్ట్ర విశేష సంపర్క్ ప్రముఖ తుముకుంట. ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి సందడి మహేశ్, జిల్లా కార్యదర్శి భానుప్రకాశ్, జిల్లా సహ కార్యదర్శి ఈపూరి నాగరాజు, జిల్లా మాతృశక్తి కన్వీనర్ జంపాల రాధిక, జిల్లా దుర్గా వాహిని కన్వీనర్ ఈపూరి లక్ష్మి, మహిళా నాయకురాలు లీలావతి, మొగలి రవీంద్రగౌడ్, శివపురం మణికంఠ, శివపురం అశ్విని, రాహుల్‌సింగ్, వివిధ సంఘాల ప్రతినిధులు, ధార్మిక, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


అధిక సంఖ్యలో తరలివచ్చిన హిందువులు


మాట్లాడుతున్న నందిరెడ్డి సాయిరెడ్డి

బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవితఖైదు

మహబూబ్‌నగర్ నేరవిభాగం, న్యూస్‌టుడే : బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. మహబూబ్‌నగర్ గ్రామీణ ఠాణా ఎస్సై విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ గ్రామీణ ఠాణా పరిధిలో 2017లో కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన విజయానంద్ అనే వ్యక్తి ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన అప్పటి సీఐ రామకృష్ణ దర్యాప్తు చేసి ఛార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు. స్పెషల్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి కేసును విచారణ చేసి మంగళవారం తన తీర్పు వెలువరించారు. నిందితుడికి జీవిత ఖైదుతో పాటు రూ.20వేల జరిమానా విధించారు. ఈ కేసులో నిందితుడికి శిక్ష పడటానికి కృషి చేసిన పీపీ పరందాములు, ఏపీపీ బాలస్వామి, అప్పటి సీఐ రామకృష్ణ, ఎస్సైలు గడ్డం కాశీ, విజయ్‌కుమార్, సీఐ గాంధీనాయక్, ఏఎస్సై బాలకృష్ణ, నాగిరెడ్డి, అశోక్‌రెడ్డిలను ఎస్పీ డి.జానకి అభినందించారు.

ఆత్మహత్యాయత్నం చేసిన కుటుంబంలో ఓ యువకుడి మృతి

నాగోలు, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యాయత్నం చేసిన కుటుంబంలో ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. కర్నూలుకు చెందిన ఉలుచాల వెంకటేశ్వర ప్రసాద్-లత దంపతులకు ముగ్గురు కుమారులు. పదేళ్లుగా దిల్‌సుఖ్‌నగర్ కోదండరాం నగర్‌లో కిరాణా దుకాణం నడుపుతున్నారు. పెద్దకుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, రెండో అతను దుకాణం చూసుకుంటున్నారు. మూడో కుమారుడు ఇటీవలే బీటెక్ పూర్తిచేశారు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈక్రమంలో కుటుంబమంతా ఆత్మహత్య చేసుకోవాలనుకున్నారు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో పురుగుల మందు తాగారు. కొంతసేపటికి తండ్రి.. పక్కింట్లో ఉండే వ్యక్తిని ఫోను చేసి కాపాడాలని కోరారు. అతడు పోలీసులకు సమాచారం ఇవ్వగా, సరూర్‌నగర్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో చిన్న కుమారుడు వంశీకృష్ణ(26) మృతి చెందాడు. మిగతా కుటుంబసభ్యులు కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

పాఠశాలల్లో దసరా మహోత్సవాలు



అమ్మవారి అలంకరణలో విద్యార్థులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తిలోని శారద, పద్మవిద్యా వికాస్ పాఠశాలల్లో దసరా ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు అమ్మవారి అలంకరణ చేపట్టారు. విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆదోని

•ఆదోని •ఆలూరు •పత్తికొండ

ఆదోనిలో ప్రభుత్వ మద్యం దుకాణాలు బంద్

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 12వ తేదీ నుంచి కొత్త మద్యం పాలసీ అమలులోకి తేవడాన్ని నిరసిస్తూ.. ఆదోని పట్టణంలో మంగళవారం ప్రభుత్వ మద్యం దుకాణాలను సిబ్బంది బందు చేసి నిరసన తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఆదోని: 77996 66004
ఆలూరు: 80085 62277
పత్తికొండ: 8008573822

కృష్ణగిరి, న్యూస్‌టుడే: **సమస్య:** ఎరుకలచెరువు గ్రామంలో కృష్ణగిరికి వెళ్లే దారిలో వర్షం నీరు పెద్ద మడుగులా నిల్వ ఉంటోంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై కోడుమూరు, కృష్ణగిరి, జోన్‌కు వెళ్లే వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. నీరు నిల్వ ఉండకుండా పనులు చేపట్టాలి. – శ్రీనివాసులు, గ్రామస్థుడు

సమాధానం: కృష్ణగిరి వెళ్లే దారిలో నీరు నిల్వ ఉండకుండా పనులు చేయిస్తాం.– ప్రవీణ్, సర్పంచి, కృష్ణగిరి

ఆస్పరి, న్యూస్‌టుడే: **సమస్య:** డి.కోటకొండ నుంచి ఆదోనికి వెళ్లడానికి వేసిన తారు రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడి అధ్వానంగా మారింది. దీంతో మా గ్రామానికి రావాల్సిన 108 అంబులెన్స్, 104 వైద్య సేవల బస్సు రావడం లేదు. విద్యార్థులు, ప్రజలు ఆదోనికి వెళ్లడానికి కూడా నిత్యం అవస్థలు పడుతున్నారు. రహదారి బాగు చేస్తే సమస్య పరిష్కారం అవుతుంది.
– వీరభద్రి, మహానంది, శివ, డీకోటకొండ, ఆస్పరి

సమాధానం: ఆదోనికి వెళ్లే రహదారి సుమారు 5 కి.మీ. మీటర్లు అధ్వానంగా ఉంది. రహదారి మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే పనులు చేయిస్తాం. – యమునప్ప, పీఆర్ ఏఈ ఆస్పరి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: **సమస్య:** ఆదోని పట్టణంలో ఎల్‌బీ.వీధి కూడలిలో బారికేడ్ వంగిపోయి, కూలేందుకు సిద్ధంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ప్రమాదం జరగకముందే అధికారులు మేల్కోవాలి. – బాలాజీ, ఆదోని

సమాధానం: ఆ ప్రాంతంలో పర్యటించి సమస్య పరిశీలించి, పరిష్కరిస్తాం.
– కృష్ణ, కమిషనర్, ఆదోని పురపాలక సంఘం

జిల్లా క్రికెట్ జట్టుకు ఆదోని క్రీడాకారుడు

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణానికి చెందిన బ్యాట్స్‌మెన్ యోధా శంకర్‌రెడ్డి అనే క్రీడాకారుడు జిల్లా క్రికెట్ జట్టుకు ఎంపికైనట్లు ఆదోని తాలుకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్, ఉపాధ్యక్షుడు ముజిబ్, మల్లప్ప తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుడు శంకర్‌రెడ్డిని మంగళవారం అసోసియేషన్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశు, బాషా, మహదేవ్, వెంకట్‌బాబు, కొల్లి రవీంద్ర, జోనాథన్, నాగరాజు, సుధాకర్‌రావు, కోచ్ బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

ఆలూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వహించాలని విద్యుత్తు శాఖ డీఈఈ పురుషోత్తం అన్నారు. ఆలూరు విద్యుత్తు కార్యాలయంలో స్వీపర్‌గా విధులు నిర్వహించిన వెంకటలక్ష్మమ్మ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఆమెను విద్యుత్తు శాఖ ఉద్యోగులు, సిబ్బంది, కార్మికులు, కుటుంబీకులు ఘనంగా సత్కరించారు.

అందరి జీవితాల్లో దసరా సంతోషం నింపాలి

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని పురపాలక మైదానంలో దసరా నవరాత్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉత్సవాలకు ఎమ్మెల్యే పార్థసారథి అంకురార్పణ చేశారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె కృష్ణమ్మ, స్వామీజీలు పంచలింగేశ్వరస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, అయోధ్య రామనారాయణతో కలిసి మంగళవారం భూమి పూజచేశారు. సమితి సభ్యులు కునిగిరి నీలకంఠ, ఉపేంద్రకుమార్, నాగరాజుగౌడ్, బసవరాజ్, సాయిప్రసాద్, అంజయ్, శ్రీకాంత్, సంజీవ్‌వర్మ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

13 ఏళ్లకే ట్యాంకు ఎలా కూలిపోతుంది?

చిన్నహరివాణం(ఆదోని గ్రామీణం), న్యూస్‌టుడే: చిన్నహరివాణం గ్రామంలో నాసిరకంగా నీటి ట్యాంకు నిర్మాణం చేసిన గుత్తేదారుడిపై చర్యలు తీసుకోవాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి డిమాండు చేశారు. గ్రామంలో సోమవారం కూలిన ఓవర్ హెడ్ ట్యాంకును ఎమ్మెల్యే పార్థసారథి పరిశీలించారు. నాణ్యతపై ఆరా తీశారు. 13 ఏళ్లకు నీటి ట్యాంకు కూలిపోవడం బాధాకరమన్నారు. నాణ్యత లేకుండా నిర్మించి, ప్రజాధనాన్ని స్వాహా చేసిన గుత్తేదారుడిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతావాణి, గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈ సాంబయ్య, ఏఈ నాగమల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

చెత్తబుట్టల పంపిణీ

దేవనకొండ, న్యూస్‌టుడే: స్వచ్ఛ కార్పొరేషన్ నుంచి 22 వేల చెత్త బుట్టలు మంజూరైనట్లు ఈవోఆర్డీ సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆయా పంచాయతీలకు వాటిని పంపిణీ చేశారు. దేవనకొండ పంచాయతీకి 2,600 చెత్తబుట్టలు వచ్చినట్లు తెలిపారు.

బాగా చదవాలి.. భవిష్యత్తు మీదే



విద్యార్థినులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



కార్యక్రమం అనంతరం తిరిగి వెళ్లే సమయంలో ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్తున్న ముఖ్యమంత్రిని విద్యార్థినులు మౌనిక, సరిత కలిసేందుకు పూలమాల, శాలువా పట్టుకొని ఉండగా అది గమనించిన ముఖ్యమంత్రి విద్యార్థినుల వద్దకు వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రికి విద్యార్థినులు శాలువా కప్పి, పూలమాల వేశారు. బాగా చదువుకొని, భవిష్యత్తులో ఉంచి ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని చంద్రబాబు సూచించారు. విద్యార్థినులతో ఫొటో దిగారు. అనంతరం అదే మార్గంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. లబ్ధిదారుల ఇళ్లలోపల ముఖ్యమంత్రి ఉండగా ఆయన్ని చూసేందుకు అభిమానులు తరలి రావటంతో వారిని నిలువరించేందుకు ఎస్పీ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది కొంత మేర ఇబ్బంది పడ్డారు. డీజీ కేయ ప్రవీణ్, ఇతర ప్రత్యేక భద్రతా విభాగం అధికారులు పటిష్ఠ బందోబస్తు చేపట్టారు. వేదిక వద్దకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేరుకొని ఆలయంలో పూజలు చేసి, బయటకు వచ్చే సమయంలో కొందరు యువకులు ముఖ్యమంత్రితో ఫొటోలు దిగేందుకు ముందుకు దూసుకురావటంతో కొంత సేపు గందరగోళం ఏర్పడింది. అప్రమత్తమైన పోలీసులు, భద్రతా సిబ్బంది వారిని అక్కడి నుంచి పంపించి వేయటంతో కార్యక్రమం ప్రశాంతంగా సాగింది. కార్యక్రమం ముగిసిన అనంతరం తిరిగి వెళ్లే సమయంలోనూ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.



అభిమానులను నిలువరిస్తున్న పోలీసులు

ముఖ్యమంత్రికి విన్నపాలు



ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ మండలం పుచ్చకాయలమాడ గ్రామ పర్యటనకు వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును ఆదోని తెదేపా మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదోని నియోజకవర్గ పరిస్థితులను వివరించారు. ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, ఇద్దరు కలిసి కట్టుగా పనిచేయాలని చంద్రబాబు సూచించినట్లు సమాచారం.



ఆలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఆలూరు తెదేపా ఇన్‌ఛార్జి వీరభద్ర గౌడ్ నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా నియోజకవర్గంలోని వేదవతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించి పూర్తిచేస్తే.. ఆలూరు నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. నగరడోణ జలాశయం నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని, హంద్రీనీవా కాల్వకు తూము ఏర్పాటు చేసి ఏబీసీకి నీరివ్వాలని విన్నవించినట్లు ఆయన చెప్పారు.

నవ్యాంధ్ర నిర్మాత చంద్రబాబు

ఆస్పరి, న్యూస్‌టుడే: నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మండలంలోని అట్టెకల్లు గ్రామంలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణయాదవ్, ఎంపీటీసీ మాజీ సభ్యులు శివకుమార్, ఎంపీటీసీ సభ్యుడు నరసప్ప, నాయకులు జీవన్‌కుమార్, శేషిరెడ్డి, సత్యరెడ్డి, రామకృష్ణ, సిద్ధు, రాజశేఖర్, సుదర్శన్, వీరేష్, తదితరులు పాల్గొన్నారు.



అట్టెకల్లులో పింఛను పంపిణీ చేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, తెదేపా నాయకులు

లబ్ధిదారుల ముఖంలో సంతోషం



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: పింఛను లబ్ధిదారుల ముఖంలో సంతోషం నిండిందని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. చిన్న హరివాణం గ్రామంలో మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతావాణి, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, భాజపా జిల్లా అధ్యక్షుడు నీలకంఠ, భాజపా నాయకులు నాగరాజు గౌడు, గోపి, తదితరులు పాల్గొన్నారు.

అనధికార వసూళ్లపై చర్యలు



గోడపత్రాలను విడుదల చేస్తున్న మార్కెట్ యార్డు అధికారులు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అనధికారిక నగదు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని యార్డు కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక యార్డులో సహాయ కార్యదర్శి శాంతకుమార్‌తో కలిసి మంగళవారం గోడపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. గత నెల 25వ తేదీన ‘ఈనాడు’లో ప్రచురితమైన ‘ప్రత్యక్ష అమ్మకం మాయం’ అనే కథనానికి అధికారులు స్పందించారు. యార్డులో రైతు పంట సరకు అమ్మకంలో కమీషన్, తూకాల ఛార్జీలు మాత్రమే తీసుకోవాలన్నారు. అదనపు వసూళ్లకు పాల్పడితే బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. అలాంటి వారిపై రైతులు నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

స్పందనకు వందనం

బాధ్యులను శిక్షించాలి



పుర వీధుల్లో ర్యాలీగా వెళ్తున్న వీహెచ్‌పీ నాయకులు, కార్యకర్తలు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ ప్రసాదం కల్తీకి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మంగళవారం ఆదోని పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. అనంతరం సంఘాల నాయకులు మాట్లాడారు. ప్రసాద కల్తీ ఘటనలో ఎంతటి వారైనా సరే కఠినంగా శిక్షించాలన్నారు. ప్రధానంగా కొండపై వివిధ హోదాలో ఉన్న అన్యమతస్తులను విధుల నుంచి తొలగించాలన్నారు. అనంతరం కార్యాలయాధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పార్థసారథి, జనసేన బాధ్యుడు మల్లప్ప మద్దతు తెలిపారు. కార్యక్రమంలో స్వామిజీలు సుబ్రహ్మణేశ్వరస్వామి, గురుసిద్ధ దేవరు, అయోధ్య నుంచి వచ్చిన స్వామి ప్రేమ్‌నారాయణ, విట్టా రమేష్, వీహెచ్‌పీ నాయకులు తలారీ ఆంజనేయులు, భీమిరెడ్డి, పంపాపతి, కిరణ్‌వర్మ, సీతారాముడు, రవిశంకర్, భజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఎల్లార్తి ఉరుసు



దర్గా ఆవరణలో భక్తులు

ఎల్లార్తి (హొళహర్వి), న్యూస్‌టుడే: హొళగుంద మండల పరిధిలోని ఎల్లార్తిలో వెలసిన షేక్షావలి, షాషావలి సాహెబ్ ఉరుసు మంగళవారం వైభవంగా ముగిసింది. మూడు రోజుల పాటు సాగిన ఉరుసుకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. మత పెద్దలు, పీఠాధిపతి, వక్ఫ్ బోర్డు అధికారులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్సై బాల నరసింహులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు



ప్రత్యేక ప్రార్థనాలు చేసేందుకు వెళ్తున్న మత పెద్దలు

పురపాలనం.. గందరగోళం

ప్రజా సమస్యలు గాలికి.. ● రాజకీయ పెత్తనం కోసం పాకులాట

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలను గాలికొదిలేశారు. అంతా కాంట్రాక్టులు, కమీషన్లు, బిల్లులపైనే పురపాలనం సాగుతోంది. సమావేశాలు సైతం గందరగోళంగా మారాయి. ఎంతగా అంటే.. ఏకంగా ఎమ్మెల్యేను భయపెట్టే స్థాయికి చేరాయి. వైకాపా ఓటమి చవిచూడటం.. కూటమి అధికారంలోకి రావడంతో రాజకీయ పెత్తనం కోసం ఎవరికి వారు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆదాయ మార్గాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొంది. తాజా పరిణామాలను పరిశీలిస్తే.. ప్రజా పాలన కన్నా తమ పట్టు నిలుపుకొనేందుకే ప్రయత్నాలు సాగిస్తున్న సంగతి బహిరంగ రహస్యమే.

ఇదీ పరిస్థితి..

ఆదోని పురపాలక సంఘం సమావేశాలు ప్రజా సమస్యల పరిష్కార వేదికలా కాకుండా.. రాజకీయ వేడుకలా మారాయి. పట్టణంలో బోలేడు సమస్యలున్నా, సభ్యులు వాటి గురించి పట్టించుకోకుండా, చర్చ చేయకుండా కేవలం రాజకీయ అంశాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. తాగునీటి దగ్గర నుంచి రహదారులు, మురుగు, వీధి దీపాలు, కుక్కల బెడద, నాసిరకం పనులు, అవినీతి అక్రమాలు ఇలా బోలెడున్నాయి. వీటిని పూర్తిగా పకనపెట్టేశారు.



ఆదోని పురపాలక సంఘం కార్యాలయం

సభ్యులది తలోదారి

మొత్తం 42 మంది కౌన్సిలర్లు ఉండగా.. 41 మంది వైకాపా వారు ఉండగా.. తెదేపా సభ్యుడు ఒక్కరే ఉన్నారు. వైకాపాలో ఒకరిద్దరు సభ్యుల తీరు వల్ల గ్రూపు రాజకీయాలు సాగుతున్నాయి. వైకాపా ప్రభుత్వ హయాంలో సమావేశమైన అరగంటలోనే.. అన్నీ ఆమోదించామని ఓ కీలక సభ్యుడు సైగ చేస్తే చాలు సభలో నుంచి సభ్యులంతా లేచి వెళ్లిపోయేవారు. వార్డు సమస్యలపై ఎవరైనా గళం విప్పితే చాలు.. మాజీ ఎమ్మెల్యే కుమారుడు ఆ సభ్యుడిని ఇంటికి పిలిపించుకుని తిట్ల దండకం చదివేవారు. దీంతో ఎవరూ నోరు మెదిపేవారు కాదు. పేరుకే ఛైర్‌పర్సన్.. పెత్తనమంతా వారి చేతుల్లోనే. ప్రస్తుతం పరిస్థితులు మారడంతో అజెండాపై చర్చలు సాగిస్తున్నారు.

మనవాడైతే బిల్లు ఆమోదం

కౌన్సిల్ వైకాపా చేతిలో ఉండటంతో బిల్లుల విషయంలో సభ్యులు కొందరు కక్షసాధింపు చర్యలకు దిగ్గుతున్నారనే విషయాన్ని ఎమ్మెల్యే బయటపెట్టారు. తాను ప్రభుత్వం ద్వారా మాట్లాడి పట్టణానికి రూ.1.24 కోట్లు ప్రజారోగ్య పనుల కోసం మంజూరు చేయిస్తే.. వాటిని ఆమోదించకుండా ఆపేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే పర్యటించిన వార్డుల్లో రెండు చోట్ల సీసీ రహదారులు అత్యవసరమని తెలిసి సిఫార్సు చేస్తే.. వాటికి అభ్యంతరం తెలుపుతూ ఆమోదించలేదు. అదే పాత రిక్రియేషన్ క్లబ్ మైదానంలో వైకాపా అనుచరుడైన గుత్తేదారుడు చేపట్టిన రూ.33 కోట్లతో పురపాలక వాణిజ్య సముదాయంలో నాణ్యత లోపాలున్నాయని ఫిర్యాదులు వచ్చినా.. చేసిన పనులకు బిల్లులు చేయాలని వైకాపా సభ్యులు ఆమోదించడం వెనుక ఆంతర్యం ఏమిటో ఇట్టే తెలుస్తోంది. పురపాలక కార్యాలయంలో ఇద్దరు అధికారులకు ఉంచిన అద్దె కార్లకు నిబంధనలు పాటించకపోయినా బిల్లులివ్వాలని, ఇదే వైకాపా సభ్యులకు స్నేహితులుగా ఉన్న కొందరు పురపాలక మార్కెట్ బకాయిలు రూ.లక్షల్లో ఉన్నా.. పట్టించుకోకపోవడం వంటి విషయాలను ఎమ్మెల్యే బహిర్గతం చేశారు. ఇక బసాపురం నీటి కుంట మరమ్మతులో నాసిరకం పనులు జరిగినా రూ.లక్షలు అవినీతి జరిగినా నోరుమెదపలేదు.

మరి ఛైర్‌పర్సన్ మాటేమిటి?

ఇక ఛైర్‌పర్సన్ శాంత మాట చెల్లుబాటయ్యే పరిస్థితే కనిపించడం లేదు. ఆమె పేరుతో ఉన్న శిలాఫలాకాలను ధ్వంసం చేయడంతో పాటు పేర్లకు రంగులు వేస్తున్నారని ఇటీవల ఆమె కౌన్సిల్ సమావేశంలో కన్నీటి పర్యంతమయ్యారు. వైకాపా హయాంలో మౌనంగా ఉండే ఛైర్‌పర్సన్ కూటమి ప్రభుత్వం వచ్చాక సభలో గట్టిగా మాట్లాడటమే కాకుండా. . ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇది రుచించని కొందరు వైకాపా సభ్యులు ఆమెను పదవి నుంచి తొలగించే ప్రయత్నాలపై దృష్టిసారిస్తున్నారు. ఇందుకు తెరవెనుక బేరసారాలు సైతం సాగినట్లు తెలుస్తోంది. నాలుగేళ్ల వరకు అధ్యక్షులను మార్చే పరిస్థితి లేకపోవడంతో ప్రయత్నాలు ముందుకు సాగటం లేదనే వాదన వినిపిస్తోంది.

స్వర్ణకార సహకార సంఘం అధ్యక్షుడు మృతికి సంతాపం

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ స్వర్ణకార సహకార సంఘం అధ్యక్షుడు వి.కె.కదురువేలు అనారోగ్యానికి గురై మృతిచెందారు. ఆ సంఘం గౌరవ సలహాదారుడు అబ్దుల్ సత్తార్, ఉపాధ్యక్షుడు సయ్యద్ మాసూమ్ పీర్, కార్యదర్శి సిద్ధిక్, సహాయక కార్యదర్శి సతీశ్‌ఆచారి, కోశాధికారి గురురాజాఆచారి, రమేశ్‌ఆచారి తదితరులు సంతాపం తెలిపారు.

అప్పు చెల్లించమన్నందుకు దాడి

ఆస్పరి, న్యూస్‌టుడే: తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని కోరిన వ్యక్తిపై దాడికి పాల్పడ్డాడని ఆస్పరి సీఐ మస్తాన్ వలీ తెలిపారు. నగరూరు గ్రామానికి మోహన్ అదే గ్రామానికి చెందిన వంశీకి రెండేళ్ల కిందట రూ.21 వేలు అప్పుగా ఇచ్చారు. వంశీ రూ.16 వేలు ఫోన్‌పే ద్వారా చెల్లించారు. మిగిలిన రూ.5 వేలు ఇవ్వాలని అడిగితే మోహన్ తండ్రి వెంకటేశ్వర్లు అడిగారు. అప్పుతీసుకున్న వ్యక్తి వంశీ వెంకటేశ్వర్లుపై దాడి చేసి తల పగలగొట్టాడని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తునట్లు తెలిపారు.

బురద దారిలో భావితరం



ఆలూరులోని హొళగుంద వెళ్లే ప్రధాన రహదారి చిన్న పాటి వర్షానికే చిత్తడిగా మారుతోంది. ఇటీవల కురిసిన వర్షానికి ఆదర్శ పాఠశాల సమీపంలోని ప్రధాన రహదారిపై నీరు నిలిచింది. అటు వైపుగా వెళ్లే పాదాచారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే దారిలో విద్యార్థులు కళాశాలలు, పాఠశాలలకు వెళ్తుంటారు. బురదలోనే నడుచుకుంటూ వెళ్లక తప్పడం లేదు. ఆటోల్లో వెళ్లేవారికీ కష్టాలు తప్పడం లేదు. - న్యూస్‌టుడే, ఆలూరు

రద్దీ.. తీరని ఇబ్బంది



ఆదోని పట్టణంలో తరుచూ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలోని జీహెచ్ రహదారి, మున్సిపల్ మెయిన్ రోడ్డు, ఎల్‌బీ వీధి ప్రధాన రహదారి, పీఎన్ రోడ్డు.. ఏదైనా ఇదే పరిస్థితి. మంగళవారం గంట పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రహదారి విస్తరణపై దృష్టిసారించకపోవడంతో కష్టాలు తప్పడం లేదని పురవాసులు అసహనానిక గురయ్యారు.
– న్యూస్‌టుడే, ఆదోని నేరవార్తలు

తాగునీటి పైపు లీకేజీ



మండల కేంద్రంలోని పశు వైద్యశాల, ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో తాగునీటి పైపులు లీకవుతున్నాయి. తాగు నీరు వృథా అవుతోంది. నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. దోమల బెడదతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అసలే వ్యాధులు ప్రబలుతున్నాయి. లీకేజీ నివారించటంతో పాటు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దేవనకొండ

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు



మొక్క నాటుతున్న కేజీబీవీ ఎన్‌సీసీ విద్యార్థినులు

సమాజ సేవ చేయాలి

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్నతనం నుంచే సమాజ సేవ చేయడం అలవర్చుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారిణి జరీనా పేర్కొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ముందస్తుగా మంగళవారం ఎన్‌సీసీ విద్యార్థినులు సమాజ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. నగర పంచాయతీలో పేదలకు పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు.

సాంకేతికతతో అధిక దిగుబడులు

నందవరం, న్యూస్‌టుడే: రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని అధిక దిగుబడులు సాధించాలని ఏవో స్రవంతి సూచించారు. మంగళవారం ఆమె మండలంలోని పూలచింత, నందవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సురేంద్రగౌడ్, వీపీఏ రామూర్తి, త్రివేణి, ఎంపీఈవో రామలక్ష్మి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు గ్రామీణం : 80085 73794
కోడుమూరు : 80085 73776

కోడుమూరు గ్రామీణం: **సమస్య:** కోడుమూరు కొత్త బస్టాండు నుంచి వర్కూరు వెళ్లే ప్రధాన రహదారిలో పలుచోట్ల గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. – అఖిల్, కోడుమూరు

సమాధానం: పరిశీలించి గుంతలకు మరమ్మతులు చేయిస్తాం. – రవిచంద్ర, డీఈఈ, ఆర్‌అండ్‌బీ

నందవరం: **సమస్య:** నందవరంలోని ఎస్సీ కాలనీకి వెళ్లే మార్గంలో రహదారి పక్కనున్న చెత్తాచెదారం, వ్యర్థాల కారణంగా దుర్వాసన వ్యాపిస్తోంది. వాటిని తొలగించగలరు. – బంగారి, నందవరం

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. – శివారెడ్డిగౌడ్, ఉప సర్పంచి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: పట్టణంలోని బంగారు దుకాణాల్లో వ్యాపారులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పట్టణ సీఐ సుదర్శన్‌రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన బంగారు వ్యాపారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలీసులమని బెదిరిస్తే నమ్మి డబ్బులు ఇచ్చి మోసపోవద్దన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తకు తాఖీదులు

కోసిగి, న్యూస్‌టుడే: 'భవనాల కొరత.. చిన్నారులకు అవస్థ' శీర్షికతో వచ్చిన కథనానికి ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు స్పందించారు. సెక్టార్-2 పర్యవేక్షకురాలు కాత్యాయిని మాట్లాడుతూ.. 24 కేంద్రాల కార్యకర్తలు, ఆయాలు సమయపాలన తప్పక పాటించాలని, ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అగసనూరు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త విజయలక్ష్మి విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో ఆమెకు తాఖీదులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

నేడు జంతువధ నిషేధం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గాంధీ జయంతి సందర్భంగా బుధవారం నగర పంచాయతీలో జంతువధ నిషేధమని కమిషనర్ నాగరాజు పేర్కొన్నారు. కమేళా, హోటళ్లు మూసివేయాలని, మాంసం, చేపలు అమ్మరాదన్నారు. నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

కూత పెట్టని రైళ్లు

- కొవిడ్ నుంచి ప్రధానమైన మూడు సర్వీసులు రద్దు
- మంత్రాలయం నుంచి నిత్యం ప్రయాణికుల ఇబ్బందులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయం ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం. రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. కొవిడ్‌కు ముందు వరకు మంత్రాలయం నుంచి ప్రధాన నగరాలకు రైళ్లు బాగానే ఉండేవి. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు, వివిధ పనులపై వెళ్లే వ్యాపారులు, ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థులు, వలస పోయే పేదలు.. ఇలా చాలా మందికి ఆయా రైళ్లు సౌకర్యంగా ఉండేవి. బుధ, గురు, శని, ఆదివారాలు, సెలవు రోజులు, దసరా, సంక్రాంతి పండగ రోజుల్లో వేలాది మంది ప్రయాణికులు మంత్రాలయానికి వస్తుంటారు. కరోనా తర్వాత ప్రధానమైన మూడు రైళ్ల సర్వీసులను రద్దు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా బస్సులు, ఇతర వాహనాల్లో వెళ్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.



ఒక టికెట్‌పై రూ.212 భారం

గుంతకల్లు నుంచి కలబురగి (గుల్బర్గ) ప్యాసింజర్ రైలు కలబురగి, షాబాద్, వాడీ, నాల్‌వార్, యాదగిరి, సైదాపూర్, కృష్ణ, రాయచూర్, మటమారి, మంత్రాలయం, కోసిగి, కుప్పగల్, ఆదోని, నగరూరు, ఆస్పరి, గుంతకల్లు 173 కి.మీ. దూరాన్ని కేవలం రూ.40తో ప్రయాణించేవారు. ఇదే బస్సులో వెళ్లాలంటే రూ.252 ఖర్చు చేయాలి. అంటే ఒక్క టికెట్‌పై రూ.212 ఆర్థిక భారం పడుతోంది. ఈ రైలు కొవిడ్‌కు ముందు తిరిగేది. ఆ తర్వాత రద్దు చేసి ఇప్పటి వరకు పునరుద్ధరించలేదు. గుంతకల్లు నుంచి మంత్రాలయం కేవలం రూ.25కే ప్రయాణించేవారు.

కాకినాడ నుంచి రాయచూరు రద్దు

కాకినాడ నుంచి రాయచూరుకు 754 కి.మీ. కేవలం రూ.230కే వెళ్లేవారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల నుంచి గుంటూరుకు వలసలు వెళ్లడానికి పేదలు, విజయవాడకు ఉన్నత విద్యకు విద్యార్థులు తక్కువ ఛార్జీతో ఈ రైలులో ప్రయాణించేవారు. ఇప్పుడు వీరిపై రూ.1,000కుపైగా ఛార్జీల భారం పడుతోంది. కరోనా సమయంలో రద్దు చేసి ఇప్పటి వరకు పునరుద్ధరించలేదు.

కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్‌కు కోత

మంత్రాలయం నుంచి తెలంగాణలోని భద్రాచలం వరకు గతంలో కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు తిరిగేది. 600 కి.మీ. దూరాన్ని రూ.109తో గమ్యం చేరుకునేవారు. బస్సు సర్వీసు లేనందువల్ల ప్రయాణికులు, భక్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరోనాకు ముందు కొల్హాపూర్ నుంచి భద్రాచలం ఉండేది. ఆ తర్వాత బెళగావి నుంచి భద్రాచలం వేశారు. 8 నెలలుగా ఈ సర్వీసును కూడా రద్దు చేయడంతో వందలాది మంది ప్రయాణికులు ప్రతిరోజూ అవస్థలు పడుతున్నారు. బెళగావి నుంచి హుబ్బళ్లి, గదగ్, హొసపేట్, బళ్లారి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం, రాయచూరు, యాదగిరి, షేడం, తాండూర్, వికారాబాద్, సికింద్రాబాద్, వరంగల్, ఖాజీపేట, భద్రాచలం తిరిగేది. రెండో ముంబయిగా పేరొందిన ఆదోని నుంచి సికింద్రాబాద్‌కు నిత్యం వందలాది మంది వ్యాపారులు ప్రయాణించేవారు. కర్ణాటక భక్తులు మంత్రాలయానికి ఈ రైలులోనే ప్రయాణించేవారు.

రూ.48 లక్షల ఆదాయానికి గండి

మూడు రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇబ్బందితోపాటు రైల్వే శాఖకు నెలకు రూ.లక్ష చొప్పున ఏడాది రూ.12 లక్షలు ఆదాయం పడిపోయింది. గడిచిన నాలుగేళ్లలో రూ.48 లక్షలను రైల్వే శాఖ కోల్పోయింది. ప్రజాప్రతినిధులు, రైల్వే అధికారులు చొరవ తీసుకుని వేలాది మంది ప్రయాణికులు, విద్యార్థులు, భక్తుల సౌకర్యార్థం ఈ మూడు రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలని కోరుతున్నారు.

ఎక్సైజ్ సీఐగా రమేశ్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు ఎక్సైజ్ సీఐగా రమేశ్‌రెడ్డి, ఎస్సైగా ఇస్మాయిల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎక్సైజ్ సీఐ మదనపల్లె నుంచి ఎస్సై ఆదోని నుంచి బదిలీపై వచ్చారు. ఉప విభాగంలో అక్రమ మద్యం కట్టడికి చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ తెలిపారు.



సీఐ రమేశ్‌రెడ్డి, ఎస్సై ఇస్మాయిల్

ప్రభుత్వ మద్యం దుకాణాల బంద్

ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది మంగళవారం దుకాణాలు బంద్ చేసి నిరసన చేపట్టారు. కొత్త మద్యం పాలసీ అమల్లోకి వస్తున్న నేపథ్యంలో కొన్నేళ్లుగా పని చేసిన తమకు ఉపాధి చూపాలని ఉప విభాగంలోని 12 మద్యం దుకాణాలను బంద్ చేశారు. ఎక్సైజ్ సీఐ రమేశ్‌రెడ్డి వారితో మాట్లాడుతూ.. దుకాణాలు తెరవాలని, మీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. దీంతో సాయంత్రం దుకాణాలు తెరిచారు.

దరఖాస్తుల స్వీకరణ


ఎమ్మిగనూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఉప విభాగంలోని ఎమ్మిగనూరు పట్టణం, మండలంతోపాటు నందవరం, మంత్రాలయం మండలాల్లో మద్యం దుకాణాల ఏర్పాటుకు మంగళవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ రమేశ్‌రెడ్డి తెలిపారు. మొత్తం 15 దుకాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో నిర్ణీత సమయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

కోసిగి, న్యూస్‌టుడే: అక్రమంగా కర్ణాటక మద్యం క్రయవిక్రయాలు చేసేవారు తగ్గించుకోవాలని ఎస్సై చంద్రమోహన్ అన్నారు. మండలంలోని కందుకూరు గ్రామంలో రామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే దారిలో మంగళవారం ఆయన అక్రమ మద్యాన్ని పట్టుకున్నారు. కడదొడ్డి గ్రామానికి చెందిన శివ వినోద్, తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన కాకలగాని జగదీశ్ మద్యం తరలిస్తుండగా 10 బాక్సుల (960) కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముళ్ల కంపలు.. రాకపోకలకు తిప్పలు

మండలంలోని వెంకటగిరి నుంచి మాసుమాన్‌దొడ్డి, కందనాతికి వెళ్లే రహదారి ఇరువైపులా ముళ్ల కంపతో మూసుకుపోయింది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. వాహన చోదకులు ఏమరపాటుగా వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు ముళ్ల కంపలు తొలగించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు గ్రామీణం



వాల్వ్ లీకేజీ.. తాగునీటి వృథా

మండలంలోని బసలదొడ్డి గ్రామానికి సరఫరా చేసే పీడ బ్యాక్‌వాస్ బోరు నుంచి గొట్టాల వాల్వ్ వద్ద లీకేజీతో తాగునీరు వృథాగా పోతోంది. దాంతో గ్రామంలో నీటి ఎద్దడి తలెత్తుతున్నట్లు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్య చాలా రోజుల నుంచి వేధిస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామంలో సుమారు 4 వేలకుపైగా జనాభా ఉంది. రూ.లక్షలు వెచ్చించి ఓహెచ్‌ఎస్ఆర్ ట్యాంకు నిర్మించినా చుక్క నీరు సరఫరా కావడం లేదని ఆందోళన చెందుతున్నారు. వృథాను అరికట్టి తాగునీటిని అందించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దకడబూరు



పత్తి బరువు.. కూలీ బతుకుదెరువు

వాతావరణ మార్పులతో ఎప్పుడు వర్షం వస్తుందో తెలియదు. ఇలాంటి సమయంలో పత్తి రైతులు తమ పొలంలోని పత్తి దిగుబడులను కూలీలకు కిలో రూ.10 నుంచి రూ.12 వరకు చెల్లించి తీయిస్తున్నారు. కూలీలు ఎంత ఎక్కువ పత్తి తీస్తే, అంత కూలి ఆదాయాన్ని పొందవచ్చు. ఒక్కో కూలీ రోజుకు సాధారణంగా 50 నుంచి 60 కిలోల వరకు తీస్తారు. మరికొంతమంది మహిళా కూలీలైతే 90 నుంచి 100 కిలోలు కూడా తీస్తారు. సాధారణంగా తీసేవారు రూ.600 నుంచి రూ.700 వరకు వంద కిలోలు తీసేవారైతే రోజుకు రూ.1,000 వరకు కూలి పొందుతున్నారు. ఇదంతా సీజన్‌లో కొద్ది రోజులు మాత్రమే. వర్షాలు తగ్గితే మళ్లీ రోజుకు రూ.250కే కూలీ పని చేయాల్సిందే. – న్యూస్‌టుడే, మంత్రాలయం గ్రామీణం (కౌతాళం)



రూ.3.70 కోట్ల పింఛన్ల పంపిణీ

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం రూ.3,70,16,500 పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని వెంకటగిరి, అమడగుంట్లలో పింఛన్ల పంపిణీని తనిఖీ చేశారు. మండలంలో 8,967 మంది లబ్ధిదారులున్నారు, 97.11 శాతం పూర్తయినట్లు తెలిపారు.

3,208 మందికి అందజేత

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని తొమ్మిది గ్రామ పంచాయతీల పరిధిలో మంగళవారం 3,208 మందికి రూ.1,35,57,000 పింఛన్లను అందజేశామని ఎంపీడీవో విజయసింహారెడ్డి తెలిపారు. మిగిలిన 49 మందికి బుధవారం అందజేస్తామన్నారు. మొదటి రోజు 98.5 శాతం పూర్తి చేశామన్నారు.

సి.బెళగల్‌లో 97.30 శాతం

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం పింఛన్లు పంపిణీ 97.30 శాతం పూర్తయినట్లు ఎంపీడీవో రాముడు తెలిపారు. ఈవోఆర్డీ కంబదహాల్, సి.బెళగల్, ముడుమాల, ఈర్లదిన్నెలో పర్యటించి పంపిణీని పరిశీలించారు.

ఉపాధ్యాయ సమస్యలపై డీటీఎఫ్ నిరసన

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ సమస్యలపై బుధవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపడుతున్నట్లు డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రామన్న, ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రధానోపాధ్యాయుడు అంపయ్య, ఉపాధ్యాయులతో కలిసి కరపత్రాలు విడుదల చేసి మాట్లాడారు. విద్యారంగానికి శాపంగా మారిన జీవో 117ను వెంటనే రద్దు చేసి అన్ని పాఠశాలల్లో తెలుగు మాధ్యమం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వరి, వీణాకుమారి, సుల్తానా, హైమావతి, సువర్ణ, ఈరన్న, హరిప్రసాద్ పాల్గొన్నారు.



కరపత్రాలు చూపుతున్న డీటీఎఫ్ నాయకులు



కరపత్రాలను విడుదల చేస్తున్న డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రామన్న

తక్షణమే జీవో 117 రద్దు చేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేస్తున్న జీవో 117ను తక్షణమే రద్దు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కృష్ణ డిమాండు చేశారు. మంగళవారం సభ్యులతో కలిసి కరపత్రాలతో నిరసన చేపట్టారు. విద్యా శాఖ మంత్రి లోకేశ్ ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛను విధానం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమార్, మారుతి, సుకూర్ సాహెబ్, రాముడు, మల్లికార్జున పాల్గొన్నారు.

పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విద్యాశాఖ ఆర్జేడీ, మాజీ ఎమ్మెల్సీ మహ్మద్ ఇక్బాల్ అన్నారు. మంగళవారం గోనెగండ్లలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. మూత్రశాలల సమీపంలోని మురుగు దిబ్బను శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శి సతీష్‌కు సూచించారు. వెంటనే పంచాయతీ సిబ్బంది కలిసి ఆయన పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగభూషణం, మురళీకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న మహ్మద్ ఇక్బాల్

కోడుమూరు తాగునీటి సమస్య తీర్చండి

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కోడుమూరు తాగునీటి సమస్యను తీర్చేందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, సీనియర్ తెదేపా నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం జిల్లాకు వచ్చిన సందర్భంగా ఓర్వకల్లు విమానాశ్రయంలో కలిశారు. కోడుమూరువాసులు ఏళ్ల తరబడిగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గాజులదిన్నె నుంచి గొట్టపు మార్గం ఏర్పాటు చేసి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సుంకేసుల జలాశయం నుంచి గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మించాలని కోరారు.



చంద్రబాబుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, తెదేపా నాయకులు

అభివృద్ధికి నిధులు కేటాయించండి

మంత్రాలయం, న్యూస్‌టుడే: అభివృద్ధికి నోచుకోని మంత్రాలయం నియోజకవర్గానికి నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును మంత్రాలయం తెదేపా నాయకుడు రాఘవేంద్రరెడ్డి కోరారు. మంగళవారం ఆయన జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడారు. సాగునీరు, తాగునీరు పథకాలకు నిధులు మంజూరు, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు, రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.

పార్టీ ఆదేశాలు గౌరవిస్తాం

మంత్రాలయం, న్యూస్‌టుడే: తెదేపా విధేయులుగా పార్టీ ఆదేశాలను గౌరవిస్తామని మండల అధ్యక్షుడు పన్నాగ వెకంటేశప్ప స్వామి అన్నారు. మంగళవారం ఆయన మంత్రాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జిగా పార్టీ ఎవరిని నియమించినా విధేయతతో పని చేస్తామన్నారు. అధిష్ఠానం ఇంకా ఎవరిని నియమించలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా కార్యదర్శి యల్లారెడ్డి, విజయరామిరెడ్డి, అబ్బులు, వట్టెప్ప నరసింహులు పాల్గొన్నారు.

తెదేపా బలోపేతమే లక్ష్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: తెదేపాను బలోపేతం చేయడమే లక్ష్యంగా సాగాలని ప్రతి ఒక్కరూ శిక్షణ పొందిన తర్వాత సభ్యత్వ నమోదు చేయించాలని శిక్షణ నిర్వాహకులు వినయ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని తెదేపా కార్యకర్తలు, బూత్, యూనిట్, క్లస్టర్ బాధ్యులకు ఒక్కరోజు శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో పేర్ల నమోదు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రాందాస్‌గౌడ్, మాచాన్‌దేశాయి, దాదాసాహెబ్, మాచాని శివకుమార్, ఈరన్న, నజీర్, శంకరయ్య, మల్లికార్జున, రామకృష్ణనాయుడు, గోపాల్, నరసింహులు పాల్గొన్నారు.

పింఛను అందేలా ఏర్పాటు చేస్తాం

మంత్రాలయం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో పింఛనురాని వారికి చంద్రబాబు పాలనలో వచ్చేలా ఏర్పాటు చేస్తామని, ఎవరూ అధైర్యపడవద్దని తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు పన్నాగ వెంకటేశ్వప్ప స్వామితో కలిసి పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత ఊరిలో ఉంటున్న వడ్డె పార్వతమ్మ తనకు ఐదేళ్లుగా పింఛను రావడం లేదని, ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఇవ్వడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు విజయరామిరెడ్డి, హనుమంతు, వట్టెప్ప నరసింహులు, గురురాజ శెట్టి, చిన్న భీమ పాల్గొన్నారు.



వృద్ధురాలు వడ్డె పార్వతమ్మతో మాట్లాడుతున్న దివాకర్‌రెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు పన్నగ వెంకటేశప్ప స్వామి

పంచాయతీల్లో గ్రామసభలు

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం ప్రతి గ్రామంలో సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులపై చర్చించి పనులను ఎంపిక చేస్తామన్నారు.

తగ్గిన వరద ప్రవాహం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి వరద నీటి ప్రవాహం తగ్గింది. మంగళవారం నాటికి 6,891 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని జలాశయ ఇంజినీర్ రాజు తెలిపారు. జలాశయంలో పూర్తి నిల్వ సామర్థ్యం 1.235 టీఎంసీలు ఉండటంతో ఒక గేటు ఎత్తి 6,891 క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రబీలో పంటలు సాగు చేసే రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచినట్లు ఏవో రవిప్రకాశ్ తెలిపారు. వర్కూరు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పంటను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట రైతుసేవా కేంద్రం సిబ్బంది అనూష, నాగరాజు, చంద్రారెడ్డి, రాముడు పాల్గొన్నారు.

చేనేత సంక్షేమం విస్మరించిన ఎన్డీయే

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం చేనేతల సంక్షేమాన్ని విస్మరించిందని చేనేత సంఘం జిల్లా కార్యదర్శి రాజు ఆరోపించారు. మంగళవారం సీపీఎం కార్యాలయంలో చేనేత కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కృష్ణ, గోవింద్, రాముడు, వీరన్న, తిమ్మప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ఎస్సీ ఉప ప్రణాళిక కింద జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వహణ సంస్థ అందించిన వ్యవసాయ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ప్రతినిధి డాక్టర్ ఎం.బాలకృష్ణన్ పేర్కొన్నారు. మండలంలోని హెచ్.మురవణి గ్రామంలో మంగళవారం ఏవో వరప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్సీ రైతు మిత్ర బృంద సభ్యులకు రూ.13.50 లక్షల విలువ చేసే వ్యవసాయ పరికరాలు 100 శాతం రాయితీ కింద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రమేశ్‌నాయక్, సాంకేతిక అధికారి విజయేంద్రరెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.



వ్యవసాయ పరికరాలు అందజేస్తున్న అధికారులు

అనుమతి లేని భయోమందులు

- సబ్ డివిజన్‌లో చాప కింద నీరులా అమ్మకాలు
- ఏటా రూ.100 కోట్లకుపైగా అక్రమ వ్యాపారం

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు ఉప విభాగంలో అనుమతి లేని బయో మందుల అమ్మకాలు చాప కింద నీరులా సాగుతున్నాయి. కొద్ది రోజులు కిందట వర్షాలు కురవడంతో పంటలకు పురుగు, తెగుళ్ల బెడద పెరిగింది. రైతులు మందుల కొనుగోలుకు వరుస కడుతున్నారు. వ్యాపారులు అనుమతిలేని బయోమందులను అంటగడుతున్నారు. దీంతో పంట పెట్టుబడి పెరిగి పురుగు, తెగుళ్ల నివారణ కాక దిగుబడులు తగ్గి రైతులు నష్టపోతున్నారు.

ఉప విభాగంలో లక్ష ఎకరాల్లో పత్తి, 15 వేల ఎకరాల్లో మిరప, 10 వేల ఎకరాల్లో కందితోపాటు ఇతర పంటలు సాగు చేశారు. పట్టణంతోపాటు గోనెగండ్ల, నందవరం, మంత్రాలయం మండలాల్లో 100కుపైగా పురుగు మందుల దుకాణాలున్నాయి. మిరప, పత్తిలో పురుగు, తెగుళ్ల బెడద ఎక్కువ. మిరపకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు, పత్తికి రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెడుతున్నారు. ఏటా రూ.100 కోట్లకుపైగా పురుగు మందులు వినియోగం ఉంటుంది. ప్రస్తుతం మిరప, పత్తి, కందికి పురుగు, తెగుళ్లు సోకుతున్నాయి. ఎమ్మిగనూరు ఉప విభాగంతోపాటు మంత్రాలయం, కోడుమూరు, ఆలూరు నియోజకవర్గాలతోపాటు సరిహద్దునున్న కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి రైతులు కొనేందుకు వస్తారు. రాష్ట్రంలో గుంటూరు తర్వాత అధికంగా పురుగు మందుల వ్యాపారం ఇక్కడే జరుగుతుందని ప్రచారం. ఇందుకు కారణం.. జిల్లా పశ్చిమ ప్రాంతంలో ఎల్లెల్సీ కాల్వ, తుంగభద్ర నదీ పరివాహక ప్రాంతం, ఎత్తిపోతల పథకాలు, గాజులదిన్నె జలాశయం, చెరువులు, కుంటలతోపాటు సుమారు 20 వేల వరకు బోర్లు ఉండటం.



గతేడాది అధికారులు పట్టుకున్న అనుమతి లేని బయో మందులు

గుట్టుగా దాచి అన్నదాతలకు అంటగట్టి

పట్టణంలోని శివారు ప్రాంతాలు, ఇతరచోట్ల అనుమతి లేని బయో మందులను నిల్వ ఉంచి రోజువారీగా ఎంతమేర అమ్మకం జరుగుతుందో అంచనా వేసి దుకాణాలకు తెచ్చి విక్రయిస్తున్నట్లు సమాచారం. గతేడాది వ్యవసాయ ప్రత్యేక బృందం తనిఖీల్లో రూ.70 లక్షలకుపైగా అనుమతి లేని బయో నకిలీ పురుగు, తెగుళ్ల మందులు పట్టుబడ్డాయి. ఈ ఏడాది అధికారుల తనిఖీలు అంతంత మాత్రమే ఉండటంతో వ్యాపారులు అనుమతి లేని మందుల అమ్మకాలు జోరుగా చేస్తున్నారు.

వ్యాపారులకు లాభాలు అధికం

అనుమతి లేని బయో మందులు హైదరాబాద్, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి మినీ లారీలు, ఇతర వాహనాల్లో తెచ్చి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. టోకు వ్యాపారులు కొందరు ఉద్యోగులను నియమించుకుని వ్యాపారుల వద్ద కెళ్లి ఏ మందు ఎంతమేర కావాలో ఆర్డర్ తీసుకుంటారు. వ్యాపారి అడిగిన పురుగుల, తెగుళ్ల మందును గుట్టుగా నిర్వహిస్తున్న గోదాముకు నేరుగా సరఫరా చేస్తున్నారు. కంపెనీ మందుల కంటే అనుమతి లేని బయో మందుల అమ్మకం ద్వారా రెండు, మూడు రెట్ల లాభాలుంటాయి. వీటి అమ్మకాలనుబట్టి వ్యాపారులకు నజరానాలు, విహారయాత్రలు వంటివి ఎరవేస్తున్నారు. ఇలా అనుమతిలేని మందుల వ్యాపారం సుమారు రూ.10 కోట్ల వరకు ఉంటుందని తెలిసింది. వ్యాపారులు రైతులకు పురుగు, తెగుళ్ల నివారణకు వాడే అనుమతి లేని బయోమందులు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఎమ్మిగనూరు ఏడీఏ ఎస్.మహమ్మద్ ఖాద్రీ అన్నారు. తనిఖీ చేసి అమ్ముతున్నట్లు తేలితే ఆయా దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని పేర్కొన్నారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



నగదు అందజేస్తున్న పురపాలక కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని పురపాలక కమిషనర్ గంగిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో పింఛన్ల పంపిణీ చేపట్టారు. ప్రతి సిబ్బందికి 50 మంది చొప్పున కేటాయించామన్నారు. వృద్ధాప్య, వితంతువు, ఇతర పింఛన్లు 9 వేలకుపైగా అందించినట్లు తెలిపారు.

విజేతలకు ధ్రువపత్రాల పంపిణీ

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: కౌతాళంలో జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రధానోపాధ్యాయుడు ఇమ్మానియేల్, యూటీఎఫ్ నాయకుడు శ్రీనివాసులు ధ్రువపత్రాలు అందజేశారు. వీరు ఈ నెల 27 జరిగే జిల్లా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, వెంకటేశ్వర్లు, మంగరాజు, ఈరన్న, తేజప్ప, బసవరాజు, నరసింహులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులు అనుసరించాలి

కోసిగి, న్యూస్‌టుడే: విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా నూతన బోధన పద్ధతులు అనుసరించాలని ప్రధానోపాధ్యాయుడు ఖలీల్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండల స్థాయి చెకుముకి పోటీల ప్రశ్నపత్రాలు విడుదల చేశారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు శంకరయ్య మాట్లాడుతూ.. పోటీల విజేతలు ఈ నెల 27న కర్నూలులో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. మానవుడు చెకుముకి రాళ్లను ఉపయోగించి నిప్పును కనుగొనడం ద్వారా మానవ జ్ఞానం ప్రారంభమైందన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డుపై విస్మరణ

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును ఎన్డీఏ ప్రభుత్వం విస్మరించిందని ఐఎఫ్‌టీయూ నాయకుడు బాలరాజు డిమాండు చేశారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యన్న, బాబు, నరేంద్ర, మల్లేశప్ప, నాగరాజు, చంద్రశేఖర్, రాజు పాల్గొన్నారు.

బాధితులకు పరికరాల వితరణ

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండలంలోని జాలవాడి గ్రామంలో ఫ్లోరోసిస్ బాధితులకు వైద్య సిబ్బంది మంగళవారం 23 మంది బాధితులకు వీల్‌ఛైర్లు, ఊతకర్రలు, బెల్టులు వితరణ చేశారు. పరికరాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి పరిమళ, వెంకటేశ్వర్లు, ప్రీతికా, ఆనందరాజు, ఆశా కార్యకర్తలు రోజామణి, జయమ్మ పాల్గొన్నారు.

కర్నూలు

•కర్నూలు •పాణ్యం

ఉక్కు పరిశ్రమను కాపాడుకుందాం


పాల్గొన్న సీఐటీయూ, విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు డిమాండ్ చేస్తూ సీఐటీయూ, విద్యార్థి యువజన సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ధర్నా చౌక్ వద్ద మంగళవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కల్లూరు పట్టణం 34వ వార్డు నిర్మల్‌నగర్, సల్కాపురం గ్రామంలో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మంగళవారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తెదేపా, జనసేన, భాజపా నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875


కర్నూలు నగరపాలకసంస్థ : సమస్య: వీకర్ సెక్షన్ కాలనీ, శరీన్‌నగర్‌లో దోమల బెడద అధికంగా ఉంది. నివారణ చర్యలు చేపట్టాలి. **– స్థానికులు**

సమస్య: కృష్ణానగర్‌లో రహదారి అధ్వానంగా మారింది. గుంతలు ఏర్పడ్డాయి. **- రామకృష్ణ**

సమాధానం: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. **- నగరపాలక సంస్థ అధికారులు**

బాపూ మాట.. ప్రగతి బాట

■ నగర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు ■ నేడు గాంధీ జయంతి



కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కర్నూలు నగరం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. గత వైకాపా పాలనలో నిధుల కేటాయింపు జరగలేదు. మరోవైపు వైకాపా పాలకులు అభివృద్ధి పేరుతో నగరపాలక సంస్థ నిధులను పక్కదారి పట్టించారు. సుందరీకరణ పేరుతో దోచుకున్నారు. నగరంలో ఎక్కడ చూసినా సమస్యలు వేధిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వివిధ పనులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. మంత్రి టీజీ భరత్ నిత్యం సమీక్షిస్తూ నగరంపై ప్రత్యేక దృష్టి సారించారు. స్వచ్ఛతకు ప్రాధాన్యమిచ్చేలా.. గాంధీజీ చూపిన మార్గంలో నడిచేలా చర్యలు చేపట్టారు.

మెరుగైన పారిశుద్ధ్యం లక్ష్యం


నగరంలో మెరుగైన పారిశుద్ధ్యానికి చర్యలు చేపట్టారు. కాలువలో పూడికతీత పనులు చేస్తున్నారు. రహదారులపై మురుగు ప్రవహించకుండా ఉండేలా చర్యలు చేపట్టారు. కాలువలపై ఆక్రమణలు తొలగించేందుకు సన్నద్ధమవుతున్నారు. నగరంలో ప్రతిరోజూ 181 మెట్రిక్ టన్నుల చెత్త పోగవుతుంది. ఈ నేపథ్యంలో ప్రతిరోజూ ఇంటింటి చెత్త సేకరణను పకడ్బందీగా చేపడుతున్నారు. దీనిని గార్గేయపురంలోని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడ రీసైక్లింగ్ తోపాటు చెత్త నుంచి గ్యాస్ తయారుచేసే ప్లాంటు ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

మురుగు శుభ్రం చేసేలా..



నగరంలో వెలువడే మురుగునీరు మొత్తం తుంగభద్ర, హంద్రీ నదుల్లో కలుస్తోంది. జలాలంతా కలుషితమవుతున్నాయి. దీనికితోడు దోమల బెడద తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో మురుగునీటి శుద్ధికి చర్యలు చేపట్టారు. జమ్మిచెట్టు సమీపంలో నిర్మిస్తున్న మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు ఆగిపోయాయి. దేవనగర్ వద్ద హంద్రీ నది సమీపంలో గత కొన్నేళ్లుగా నిర్మిస్తూనే ఉన్నారు. ఈ పనులు పూర్తి చేయడంతోపాటు కొత్తగా సుంకేసుల రహదారి, హిందూ శ్మశాన వాటిక సమీపంలో మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

రహదారుల విస్తరణకు అడుగులు



నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. సుమారు 4 లక్షల వాహనాలు ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఆ స్థాయిలో రహదారుల అభివృద్ధి జరగలేదు. ఈ నేపథ్యంలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. పాత నగరం, వైద్య కళాశాల తదితర ప్రాంతాల్లో విస్తరణ పనులు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారితో చర్చించిన తర్వాతే ముందుకెళ్లనున్నారు. రాజ్‌విహార్ నుంచి పాత నగరం, సంకల్‌బాగ్ సమీపంలో బండ్ రస్తాలు ఏర్పాటు చేయాలని మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నారు.

తాగునీటి కష్టాలు తీర్చేలా..

నగరంలో 6.5 లక్షల జనాభా ఉంది. ప్రతిరోజు 120 ఎంఎల్‌డీ నీరు అవసరం ఉంది. ప్రస్తుతం 95 ఎంఎల్‌డీ వరకు సరఫరా చేస్తున్నారు. కల్లూరు కాలనీలకు రెండు మూడు రోజులకోసారి తాగునీరు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని ప్రాంతాలకు ప్రతిరోజూ తాగునీరు అందించేలా పాలకులు, అధికారులు దృష్టి సారించారు. వేసవిలో సైతం తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారానికి అడుగులు వేస్తున్నారు. ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి మంచి నీటిని అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

క్రీడలతోనే ప్రత్యేక గుర్తింపు సాధ్యం


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: ఫుట్‌బాల్ క్రీడాకారులందరూ మెస్సీ రోనాల్డ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి టీజీ.భరత్ సూచించారు. నగరంలోని రిడ్జి ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 ఫుట్‌బాల్ క్వార్టర్ ఫైనల్స్ పోటీలను మంత్రి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి.పుల్లయ్య అధ్యక్షత వహించారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ.. రోజువారీ జీవితంలో క్రీడలు భాగస్వామ్యం కావాలన్నారు. నగరంలో జాతీయస్థాయి వసతులతో కూడిన మైదానం నిర్మాణానికి ప్రభుత్వం తరఫున కృషి చేస్తామన్నారు. ఒలింపిక్ క్రీడలు నిర్వహించేందుకు ప్రధాని మోదీ దృఢ సంకల్పంతో ఉన్నారని తెలిపారు. పాఠశాల సీఈవో గోపినాథ్, పోటీల కార్యదర్శి, డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన పోటీల్లో పలు జట్లు గెలుపొందాయి.

ఉపాధి చూపాలని ఆందోళన


జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపాలని మెన్లు, సూపర్‌వైజర్లు డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు జగన్‌చంద్ర రెడ్డి మాట్లాడారు. ఏ కారణంతో చర్చలు అనంతరం ... చూపాలని ఉమ్మడి జిల్లాలో తరం ప్రభుత్వ మద్యం దుకాణాల సేల్స్ ... సాయంత్రం విధులకు హాజరయ్యారు.

ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.3,769

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం 11,502 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు వచ్చాయి. క్వింటా కనిష్ఠ ధర రూ.310, మధ్యస్థ ధర రూ.2,067, గరిష్ఠ ధర రూ.3,769 పలికింది. మధ్యస్థ ధరలో ఎలాంటి పెరుగుదల లేదని, నాణ్యత పేరుతో వ్యాపారులు ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

వృద్ధులకు ఉచిత న్యాయ సాయం

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర పరిధిలోని మన వృద్ధులు, పిల్లల ఆశ్రమంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ వృద్ధులు ఉచిత న్యాయ సాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చన్నారు. అనంతరం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకుడు ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ కబుర్లు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని ఎల్ఐసీ పార్కు అధ్వానంగా మారిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు ఇ.పుల్లారెడ్డి తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ ఉద్యానవనం.. అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా మారిందన్నారు. నగరపాలక అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: వీరశైవ లింగాయత్, లింగ బలిజలను ఓబీసీలో చేర్చాలని తెదేపా వీరశైవ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.వి.శివరాజ్ కోరారు. ఆయన మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి విన్నవించారు. నగరంలో బసవ భవన్ నిర్మించాలని కోరారు

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కల్లూరు మండల పరిధి పెద్దటేకూరు, పందిపాడులో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆత్మ డీపీడీ శ్రీలత, కర్నూలు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ శాఖ సంచాలకులు సాలురెడ్డి రైతులకు పలు సూచనలు అందజేశారు. ఖరీఫ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: గుండెపోటుతో మృతి చెందిన ఆటో డ్రైవర్ గోపాల్ తన కళ్లను దానం చేసి అందరిలో స్ఫూర్తి నింపారని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, రాముడు, ప్రభాకర్ పేర్కొన్నారు. ముజఫర్‌నగర్‌లో ఆయన మృతదేహానికి మంగళవారం పలువురు నాయకులు నివాళి అర్పించారు.

ఈనాడు, కర్నూలు : ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ డైరెక్టర్‌గా ముంతాజ్ షేక్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. వైకాపా పద్మలతారెడ్డి స్థానంలో ఆమెను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: వెనుకబడిన కర్నూలు జిల్లా అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరించాలని భాజపా జిల్లా అధికార ప్రతినిధి పీటీ సాయి ప్రదీప్ కోరారు. జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును ఓర్వకల్లు విమానాశ్రయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి, ఆర్‌యూ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించండి

ఓర్వకల్లు, న్యూస్‌టుడే : ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, గౌరు చరితారెడ్డి తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు. జిల్లా పర్యటనలో భాగంగా ఓర్వకల్లు విమానాశ్రయానికి ముఖ్యమంత్రి మంగళవారం మధ్యాహ్నం 12.30కు చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు బీసీ జనార్దన్‌రెడ్డి, ఎన్‌ఎండీ ఫరూక్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేసేందుకు చొరవ చూపాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి విన్నవించారు.

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: జిల్లాలో కోడుమూరు నియోజకవర్గం అన్నివిధాలా వెనుకబడిందని, నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే దస్తగిరి, తెదేపా సీనియర్ నేత విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కోరారు.

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఇతర న్యాయవాదులు మంగళవారం కలిశారు. హైకోర్టు బెంచి ఏర్పాటు ప్రకటనపై కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల కుటుంబాలకు భద్రత కల్పించేలా బీమా పాలసీ ప్రవేశపెట్టాలని, అర్హులకు ప్రభుత్వ ధరలకే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వారు విన్నవించారు.


చంద్రబాబుతో తెదేపా సీనియర్ నేత విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యే దస్తగిరి


న్యాయవాదులు ఇచ్చిన వినతిపత్రం పరిశీలిస్తూ..


వినతిపత్రం పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, చిత్రంలో ఎమ్మెల్యేలు కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి, గౌరు చరితారెడ్డి, తెదేపా నేత గౌరు వెంకటరెడ్డి తదితరులు

సమయపాలన తప్పనిసరి

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే: సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సూచించారు. కర్నూలు మండలం పి.రుద్రవరంలో మంగళవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో అనురాధ, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మాంసం దుకాణాల మూత

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే : గాంధీ జయంతిని పురస్కరించుకొని నగరంలో బుధవారం మాంసం విక్రయాలు జరపకూడదని.. కబేళాలు, మాంసం దుకాణాలు మూసేయాలని నగరపాలక కమిషనర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మాంసాహారం అమ్మకూడదని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంట సాగులో మెలకువలు అవసరం

ఓర్వకల్లు న్యూస్‌టుడే: పంట సాగులో మెలకువలు పాటించి లాభాలు గడించాలని ఏవో సుధాకర్ అన్నారు. ఓర్వకల్లు, కన్నమడకల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పంటలను ఆశించే తెగుళ్లపై అవగాహన కల్పించారు. జడ్పీటీసీ సభ్యుడు రంగనాథగౌడ్, తెదేపా మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయకులు లక్ష్మీకాంతారెడ్డి, సుధాకరయ్య, ఏఈవోలు భాస్కర్, మధు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

గైనిక్‌లో సీటీజీ మానిటర్ల ప్రారంభం

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: కర్నూలు సర్వజన వైద్యశాలలోని గైనిక్ విభాగంలో సీటీజీ మానిటర్లను ఆసుపత్రి పర్యవేక్షకుడు డా.ప్రభాకరరెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. గర్భిణులకు ప్రసవ సమయంలో శిశువు గుండె పనితీరును గమనించి హైరిస్క్ ప్రెగ్నెన్సీ మోర్టాలిటీ రేటు తగ్గించేందుకు సీటీజీ మానిటర్లు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో గైనిక్ హెచ్‌వోడీ డా.శ్రీలక్ష్మి, డా.సావిత్రి, డా.శ్రీలత, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళిని తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్ పోటీల్లో ప్రతిభ

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: విశాఖలో ఏపీ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన షూటింగ్ పోటీల్లో కర్నూలుకు చెందిన ముస్తాక్ అహ్మద్ స్వర్ణ పతకం గెలిచారు. ఈ సందర్భంగా క్రీడాకారుడిని రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎండీ బాషా, శిక్షకుడు రవికుమార్ మంగళవారం అభినందించారు.

అవగాహన అవసరం


మాట్లాడుతున్న కార్మికశాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు

వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: పోషణ, రక్షణ చట్టాలపై వయో వృద్ధులు అవగాహన పెంచుకోవాలని కర్నూలు కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాంబశివరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని 48వ వార్డులో సుమలత ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, నాగప్ప, నారాయణమ్మ, కర్రమ్మ, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో ఘనకీర్తి

☛ జాతీయస్థాయి పోటీల్లో రాణింపు


అందుకున్న పతకాలతో కీర్తి

కర్నూలు క్రీడలు, న్యూస్‌టుడే : కర్నూలుకు చెందిన తోటిరెడ్డి కీర్తి నగరంలోని ఓ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఆమె తల్లిదండ్రులు సరస్వతి, కోటిరెడ్డి. వీరి స్వప్రాంతం లక్ష్మీపురం. కీర్తికి మొదటి నుంచి క్రీడలంటే మక్కువ. ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సంకల్పించారు. దీనికి ఉపాధ్యాయులు, స్నేహితులు చేయూతనిచ్చారు. ఈ నేపథ్యంలో అవసరమైన మెలకువలు నేర్చుకున్న కీర్తి వివిధ ప్రాంతాల్లో జరిగే పోటీల్లో పాల్గొనడం ప్రారంభించారు.

వరించిన పతకాలు

☛ గతేడాది నవంబరులో రేపల్లెలో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో (55 కిలోలు) స్వర్ణ పతకం అందుకున్నారు. ఈ ఏడాది జులై 27 నుంచి 30వ తేదీ వరకు న్యూదిల్లీలో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో కాంస్య పతకం అందుకోవడం విశేషం.

☛ ఇదే ఏడాది జులైలో గుంటూరు జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పసిడి పతకం కైవసం చేసుకున్నారు. అనంతరం ఆగస్టు 16 నుంచి 18వ తేదీ వరకు కాన్పూర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో (55 కిలోలు)లో సెమీఫైనల్స్ వరకు చేరుకున్నారు. ఆమె ప్రతిభను అందరూ అభినందించారు.

☛ సెప్టెంబరు 9 నుంచి 13వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని శివగంగ జిల్లాలో జరిగిన సీబీఎస్ఈ దక్షిణ మండలం తైక్వాండో పోటీల్లో 68 కిలోల విభాగంలో బంగారు పతకం అందుకోవడం విశేషం. త్వరలో ఉత్తరప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పతకం సాధించేందుకు సన్నద్ధమవుతున్నారు.


☛ ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతిరోజూ మాస్టర్ సుందర్ వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నట్లు చెప్పారు.

అడుసుదారి



కర్నూలు నందికొట్కూరు రోడ్డులోని రెవెన్యూ ఉద్యోగుల సంఘం కాలనీలో రహదారి బురదమయంగా మారుతోంది. చినుకు పడితే చాలు.. అడుగు పెట్టలేని పరిస్థితి. వర్షాకాలంలో కాలనీవాసుల ఇబ్బందులు అన్నీఇన్నీకావు. ఎర్రమట్టి దారి కావడంతో బురదతో నిండిపోతోంది. వెంటనే సీసీ రహదారి నిర్మించాలని కాలనీవాసులు విన్నవిస్తున్నారు. **– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం**

కుళ్లి.. దుర్గంధంతో నిండి



కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. సకాలంలో తొలగించకపోవడంతో భరింపరాని దుర్గంధం వస్తోంది. ఫలితంగా దిగుబడులు తీసుకొచ్చే రైతులు విపణిలో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. వ్యర్థాల తొలగింపు పేరుతో పెద్దఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నా శుభ్రత చర్యలు కానరావడం లేదు. **– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం**

క్రైం కార్నర్

గుర్తుతెలియని మహిళ మృతి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ గుర్తుతెలియని మహిళ (40) మృతి చెందారు. మృతదేహాన్ని మంగళవారం గుర్తించిన ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆమె వివరాలు తెలియకపోవటంతో మృతదేహాన్ని శవాగారానికి తరలించారు. ఆమె వివరాల కోసం కర్నూలు మూడో పట్టణ పోలీసులు ఆరా తీస్తున్నారు.

వివాదంలో మూడో పట్టణ పోలీసులు

కర్నూలు న్యాయవిభాగం, నేరవిభాగం న్యూస్‌టుడే : కర్నూలు మూడో పట్టణ పోలీసులు మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. దొంగతనం ఆరోపణలతో కర్నూలుకు చెందిన మహేష్, బాలకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్న నేపథ్యంలో మహేష్ భార్య, కుటుంబసభ్యులు ఆబ్కారీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కేసు నమోదు చేయకుండా.. కోర్టులో హాజరు పరచకుండా మహేష్, బాలకృష్ణను గత 18 రోజులుగా నిర్బంధంలో ఉంచుకుని పోలీసులు విచారిస్తూ వేధిస్తున్నారని ఆరోపించారు. న్యాయమూర్తి స్పందించి బాధితుల వాంగ్మూలం నమోదు చేసుకుని అడ్వకేట్ కమిషనర్‌ను నియమించి సెర్చ్ వారెంట్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో అడ్వకేట్ కమిషనర్ సోమవారం రాత్రి కర్నూలు మూడో పట్టణ పోలీసుస్టేషన్‌ను సందర్శించి ఇద్దరిని గుర్తించి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా వారిని విడుదల చేశారు. ఇళ్లకు చేరిన మహేష్, బాలకృష్ణలు మీడియాతో మాట్లాడుతూ పోలీసులపై పలు ఆరోపణలు చేశారు.

ఆటో చోదకులపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలుకు చెందిన ఆటో చోదకులు గోపీ, వెంకటేశ్వరగౌడ్‌లపై నాలుగో పట్టణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. కర్నూలు నుంచి ఎమ్మిగనూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును నిందితులు ప్రయాణికుల కోసం ఆపాలని సంకేతాలు ఇచ్చారు. బస్సు డ్రైవర్ కాస్త ముందు ఆపుతానని చెప్పారు. నిందితులు రెచ్చిపోయి ఉల్చాల రోడ్డులో బస్సును ఆపి బస్సు అద్దాలు పగులగొట్టడంతోపాటు డ్రైవర్‌పై దురుసుగా ప్రవర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.